



చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

చంద్రమౌళి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

అందజేసిన మంత్రి డోలా, ఎంపీ భరత్

10

పాలనలో ఏఐ వినియోగించినా..

# మానవీయకోణం ముఖ్యం




- టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్‌లో సేవల డెలివరీ
- స్మార్ట్ పాలనకే ప్రభుత్వం ప్రాధాన్యత...
- రాష్ట్రంలో త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు
- ఏఐ వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సచివాలయంలో రెండు రోజులపాటు జరగనున్న సదస్సు

2

పాలన, ప్రజాసేవ లక్ష్యంగా

## ఏఐపై సమగ్ర అవగాహన

- 'ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'పై వర్క్‌షాప్
- ప్రారంభోపన్యాసం చేసిన సీఎం చంద్రబాబు
- కేస్ స్టడీలతో అవగాహన కల్పించిన నిపుణులు
- కీలక అంశాలపై నేడు సెకెండ్ సెషన్



## సంకల్పంతో సవాళ్లు దాటొచ్చు

- దృఢ సంకల్పానికి నిలువెత్తు కేతనం ఎన్టీఆర్
- పాజిటివ్ మైండ్‌తోనే చిరంజీవి టాప్‌కు చేరారు
- అద్భుత పుస్తకం రాసిన శరణికి అభినందనలు
- 'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు

3

## పీపీపీతోనే వేగంగా వృద్ధి



4

- స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరేందుకు సులువైన మార్గమిదే
- మూలధన వ్యయం పెరిగేలా మౌలిక వసతులపై వెచ్చించండి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

పహల్గాం ముష్కరులు.. ఎక్కడ నక్కినా

## వేటాడి ఏరేస్తాం

- సాయమందించిన వారూ మూల్యం చెల్లించుకోకతప్పదు
- ఉగ్రవాదులకు ప్రధాని మోదీ హెచ్చరిక



8

## ఆన్‌లైన్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్

- ఆచార్య యాప్‌తో అభ్యర్థులకు శిక్షణ
- ప్రారంభించిన బీసీ సంక్షేమ మంత్రి సవిత
- 24 గంటలూ యాప్ ఓపెన్ చేయొచ్చు
- అందుబాటులో మెటీరియల్, పాత పేపర్లు

9

అండమాన్-నికోబార్‌లో టీడీపీ మరో విజయం..

శ్రీవిజయపురం మున్సిపల్ చైర్మన్‌గా హమీద్



7

## ఉగ్రవాదాన్ని ఊడ్చేస్తాం

- పహల్గాం ముష్కరులపై కఠినచర్యలు
- అఖిలపక్షానికి కేంద్రం స్పష్టీకరణ
- ఈ పోరాటంలో మద్దతుగా ఉంటామని అఖిలపక్షం హామీ
- పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం

8

## ఉగ్రవాదాన్ని టీడీపీ సహించదు

- మాది జాతీయ భావాలు కలిగిన పార్టీ
- పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య
- ఉగ్రమూకలు ఫలితం అనుభవిస్తారు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఉద్ఘాటన
- పహల్గామ్ నరమేధానికి నిరసనగా పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ

6

## పాలనలో ఏఐ వినియోగించినా..

# మానవీయకోణం ముఖ్యం

- టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్‌లో సేవల డెలివరీ
- స్మార్ట్ పాలనకే ప్రభుత్వం ప్రాధాన్యత...
- రాష్ట్రంలో త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు
- ఏఐ వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సచివాలయంలో రెండు రోజులపాటు జరగనున్న సదస్సు




అమరావతి (చైతన్య రథం): పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని... ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశ పెట్టాల్సి ఉందన్నారు. టెక్నాలజీ అనేది ప్రజలకు ఉపయోగపడాలని... రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్సఫర్మేషన్' అంశంపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు.

### ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజులవి

2 ఎంబిపీఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజులనుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దిన నేటి వరకు తన ప్రయాణాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్లనాడు చేసిన ప్రయత్నంతో నేడు ఏపీ టెక్నాలజీలో కీలకంగా ముందుందని ప్రస్తావించారు. మన ప్రభుత్వ వ్యవస్థల్లో మేధాసంపత్తి ఉన్నవారు ఉన్నప్పటికీ ఇంకా పాత విధానాలు అనుసరిస్తున్నారని... పాలనలో తీరు మారాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు,వినతుల్లో అధికంగా 75శాతం భూసంబంధితమైనవే ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహ ప్రయోగాలను ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు మన స్టార్టప్‌లు రూ.30 కోట్లతో ఉపగ్రహాలను తయారు చేస్తున్నాయని, దీంతో ప్రపంచం మనవైపు గర్వంగా చూస్తోందన్నారు. ఈ వర్క్‌షాప్ దేశానికి ఒక నమూనాగా నిలుస్తుందని, డిజిటల్, డైనమిక్, ప్రజల కోసం పని చేసే పాలనకు ఇది ఆరంభమని ముఖ్యమంత్రి అన్నారు.

### రెండు రోజుల పాటు వర్క్‌షాప్

రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్,ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ జరుగుతాయి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్‌ను అధికారులు పరిశీలిస్తారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ద్వారా నిపుణులు విశ్లేషిస్తారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని వివరిస్తారు. వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు హాజరుకాగా, రెండోరోజు విభాగాధిపతులు పాల్గొంటారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్, వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సీఈవో ప్రకాష్‌కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్‌దాస్ హాజరయ్యారు.



## పాలన, ప్రజాసేవ లక్ష్యంగా

# ఏఐపై సమగ్ర అవగాహన

- 'ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'పై వర్క్‌షాప్
- ప్రారంభోపన్యాసం చేసిన సీఎం చంద్రబాబు
- కేస్ స్టడీలతో అవగాహన కల్పించిన నిపుణులు
- కీలక అంశాలపై నేడు సెకెండ్ సెషన్




అమరావతి (చైతన్య రథం): "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరియు ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్"పై రెండురోజుల వర్కుషాపు సచివాలయంలో గురువారం ప్రారంభమైంది. ఏఐ ఆధారిత సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజాసేవను వేగవంతం చేసేందుకు అవసరమైన అవగాహనను ప్రభుత్వ యంత్రాంగానికి కల్పించడమే దీని లక్ష్యం. ఐటీఈ-సీ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తోన్న వర్క్‌షాప్ తొలిరోజు సెషన్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సాగింది. పాలనలో కృత్రిమ మేధస్సు సామర్థ్యం మరియు డిజిటల్ పరివర్తన వ్యూహాలపై అధికారులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సెషన్ సాగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పరిచయంతో ప్రారంభమైన వర్కుషాపులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేశారు. పాలన, ప్రజాసేవను మెరుగుపర్చడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

అనంతరం ఎంఈఐటీవై, డాట్ మాజీ కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్.. ఈ-గవర్నెన్స్ నుంచి ఏఐ-గవర్నెన్స్‌కు పరివర్తనపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. 'అభివృద్ధి చెందుతున్న సాంకేతికత చాలా శక్తివంతమైంది. స్వల్పకాలంలో సాంకేతికత ప్రభావాన్ని అతిగా అంచనా వేయడం.. దీర్ఘకాలంలో తక్కువగా అంచనా వేయడం సర్వసాధారణం. అలాకాకుండా.. సాంకేతిక వినియోగానికి ముందుగా సంసిద్ధమయ్యేవారు మంచి ఫలితాలు సాధిస్తారు. ఏఐ ఆధారిత టెక్నాలజీ భారత్ మరియు ఆంధ్రలాంటి రాష్ట్రాలకు ఎంతో ఉపయుక్తం' అన్నారు.

ప్రభుత్వ విధానాలు మరియు కార్యక్రమాల ద్వారా పాలనా సామర్థ్యంపై ఏఐ అంతర్గత ప్రభావం.. పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిపై బాహ్య ప్రభావం రెంటినీ ప్రజెంటేషన్‌లో వివరించారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం నుంచి వచ్చిన కేస్ స్టడీలత ఏఐపై అవగాహన కల్పించారు. కృత్రిమ మేథ ఆరోగ్య సంరక్షణ ఖర్చులను 50శాతం, వ్యవసాయ ఇన్‌పుట్ ఖర్చులను 25శాతం ఎలా తగ్గించగలదో, అట్టడుగుస్థాయిలో వ్యవస్థాపక నమూనాల ద్వారా గణనీయమైన ఉపాధి అవకాశాలను ఎలా సృష్టిస్తుందో చంద్రశేఖర్ తన ప్రజెంటేషన్‌లో వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ సామర్థ్యాన్ని నొక్కి చెబుతూ.. భారత్ 1శాతంకంటే తక్కువ డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తుంటే.. చైనా 80శాతం పైబడి వినియోగంలోకి తెచ్చిందని.. ఇది వృద్ధికి, ఉపాధి కల్పనకు సూచికగా పేర్కొన్నారు.

వాద్వానీ ఫౌండేషన్ (డబ్ల్యుజీడీటీ) సీఈవో ప్రకాష్‌కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం సెషన్ జరిగింది. బహుళ ప్రభుత్వ రంగాలలో ఏఐ ఆచరణాత్మక అనువర్తనాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యానికి డబ్ల్యుజీడీటీ నిబద్ధతను నొక్కిచెబుతూ, ప్రణాళిక పూర్తిగా అమలయ్యేలా ఎక్కువ కాలం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. పాఠశాల విద్య, పట్టణ మౌలిక సదుపాయాలు, వైద్యం-ఆరోగ్యం, ప్రభుత్వ పాలన, జాతీయ కుటుంబ సర్వే, వ్యవసాయం.. ఇలా భిన్న రంగాలలో ఏఐ సాంకేతికతను వినియోగించి ఎంతటి అద్భుత ఫలితాలు సాధించవచ్చో కేస్ స్టడీలతో సహా వివరించారు. ఇంటరాక్టివ్ బ్రెయిన్ స్ట్రామింగ్ సెషన్‌తో తొలి రోజు వర్కుషాపు ముగిసింది. కంప్యూటర్ విజన్ అప్లికేషన్లు, వాణిజ్య పన్ను శాఖ ఏఐ సాధనాలు, "ఏఐ ప్లేబుక్" ద్వారా భావనల నుండి పైలట్ ప్రాజెక్టులకు మారడంపై మార్గదర్శకత్వం వంటి ఆచరణాత్మక ప్రదర్శనలు శుక్రవారం రెండోరోజు వర్కుషాపులో వివరించనున్నారు.



# సంకల్పంతో సవాళ్లు దాటొచ్చు


అమరావతి (చైతన్య రథం): నమ్మకానికి సంకల్పం తోడైతే ఎటువంటి సవాళ్లనైనా అధిగమించవచ్చునని, మనిషి దృఢ సంకల్పం ఎంతలా పని చేస్తుందనడానికి ఎన్టీఆర్ జీవితమే ఉదాహరణ అని సీఎం చంద్రబాబు అన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ కుమార్తె శరణి రచించిన మైడ్‌సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలి కాపీని మెగాస్టార్ చిరంజీవికి అందించారు. అనంతరం శరణి అడిగిన పలు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానమిచ్చారు.

- దృఢ సంకల్పానికి నిలువెత్తు కేతనం ఎన్టీఆర్
- పాజిటివ్ మైండ్‌తోనే చిరంజీవి టాప్‌కు చేరారు
- అద్భుత పుస్తకం రాసిన శరణికి అభినందనలు
- 'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు




### నారాయణ కూతుళ్ల ఎదుగుదలను చూసి ఆశ్చర్యపోయా

'నారాయణ కూతుళ్లను ఇప్పటిదాకా చిన్నపిల్లలుగానే చూశాను. నారాయణ అంటే నాకు పరిచయమే కాదు ప్రత్యేక అభిమానం. ఉన్నత స్థితికి ఎదిగిన మిమ్మల్ని (శరణి), మీ సోదరిని చూసి ఆశ్చర్యపోయాను. తండ్రిచాటు బిడ్డల్లా నారాయణ సంస్థలను నడుపుతున్నారనుకున్నాను. కానీ మీకంటూ ఒక ఆచరణ ఉంది. 47 ఏళ్లుగా నేను చేసే సాధనలు మీరు చిన్న వయసులోనే చేస్తున్నారు. మైండ్ సెట్ అనేది నారాయణ సంస్థల్లో ఒక బ్రాండ్. ఒక సాధారణ విద్యార్థిని నారాయణ సంస్థల్లోకి పంపితే అసాధారణ విద్యార్థిగా తీర్చిదిద్ది పంపుతున్నారు. ఏ విషయంలోనైనా విజయం సాధించేవరకు నారాయణ విశ్రమించరు. మంచి అంశాన్ని ఎంచుకుని మైండ్‌సెట్‌ను మార్చుకుంటే ఏదైనా సాధించగలరని అతి చిన్న వయసులోనే పుస్తకం రాసి నిరూపించిన శరణిని అభినందిస్తున్నా. పదిమందీ పైకి రావడానికి శరణి ప్రయత్నిస్తున్నారు' అని చంద్రబాబు ప్రశంసించారు.



### ఎన్టీఆర్ కష్టపడి పైకొచ్చారు

చిరంజీవి ఒక సంకల్పం తీసుకుని అద్భుత నటుడయ్యారు. చిరంజీవి తన జీవితంలో పాజిటివ్ మైండ్‌సెట్ అభివృద్ధి చేసుకుని లక్ష్యాన్ని ఛేదించేవరకు నిరంతర కృషి చేశారు. ఎన్టీఆర్ ఉన్నంతకాలం చిరంజీవి ఒక స్థాయికి ఎదిగారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక ఆకాశమే హద్దుగా చిరంజీవి మహానటుడిగా ఎదిగారు. నేను చదువుకునే సమయంలో నువ్వు బాగా చదవితే ఐఏఎస్ అవుతావని కొందరు చెప్పేవారు. ఐఏఎస్ అయితే పదిమందిలో ఒకడిని అవుతానని అనుకున్నాను. యూనివర్సిటీలో మా వీసీ పిలిచి లెక్చరర్ పోస్ట్ ఇస్తాను చేరతారా? అంటే వద్దని చెప్పాను. ఎందుకని ప్రశ్నిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పాను. అనుకున్న ప్రకారం ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచాక మంత్రి అవ్వాలనుకున్నాను. అప్పటి సీఎం చెన్నారెడ్డి దగ్గరకు వెళ్లి మంత్రిపదవి కావాలని అడిగాను. నిన్నటి వరకు యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్న నువ్వు... ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి, అప్పుడే మంత్రి పదవి అడుగుతున్నావన్నారు. నాకు అర్హత ఉంటే ఇవ్వండని చెప్పి ఛాలెంజ్ చేసి వచ్చాను. తర్వాత రెండేళ్లకే సినిమాటోగ్రఫీ మంత్రి అయ్యాను. తర్వాత నందమూరి జయకృష్ణ సూచనతో ఎన్టీఆర్‌ని కలిసిన తర్వాత భువనేశ్వరితో పెళ్లికి ప్రతిపాదన పంపారు. చిరంజీవి కూడా సాధారణ కుటుంబం నుంచి వచ్చారు. ఎన్టీఆర్ కష్టపడి పైకొచ్చారు. ప్రతి వ్యక్తి జీవితంలో ఛాలెంజ్, సంక్షోభం వస్తాయి. ఏ రాజకీయ నాయకుడికి రానన్ని సంక్షోభాలు నాకు వచ్చాయి. వాటిని బలంగా ఎదుర్కొని పైకి వచ్చాను. గాంధీ, అంబేద్కర్ సాధారణ కుటుంబంనుంచి వచ్చారు. అంబేద్కర్ అంటరాని తనం, అవమానాలు భరించి రాజ్యాంగాన్ని రాసి చిరస్థాయిగా భావితరాలకు ఆదర్శంగా నిలిచారు' అని చంద్రబాబు జీవితంలో ఎత్తుపల్లాలు, సవాళ్లను ఉదాహరణలతో వివరించారు.

### అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

నారాయణ సంస్థల్లో సిబ్బందిని ఎంపిక చేసుకోగలుగుతారు, కావాలంటే మార్చగలుగుతారు. నేను ప్రభుత్వంలో ఉన్న అధికారులందరినీ మార్చలేనుగానీ వారి స్థానాలను మార్చగలను. 1995లో నేను సీఎం అయ్యాను. ఐటీ అంటే తెలియని అధికారులు నాడు ఉన్నారు. ఆ సమయంలోనే హైటెక్ సిటీ నిర్మించాం. పల్లెటూర్ల నుంచి చాలామంది వచ్చి ఐటీ ఉద్యోగాలు చేశారు. నారాయణ విద్యాసంస్థలను కూడా ప్రోత్సహించాను. ఆ రోజుల్లో ఐఐటీలో ఒకశాతం కూడా అడ్మిషన్స్ వచ్చేవి కావు. విద్యాసంస్థల అధినేతలను పిలిచి ఐఐటీలో మనం నెంబర్‌వన్‌గా ఉండాలని చెప్పాను. తర్వాత వచ్చిన మార్పులతో 20 శాతం సీట్లు మనవాళ్లే సాధిస్తున్నారు. బిట్స్ పిలానీలో 70 శాతం తెలుగువారే ఉండేవారు. ఇంతమంది ఎలా వస్తున్నారు, మార్కులు తారుమారు చేస్తున్నారేమోనని వాళ్ల సొంత వ్యవస్థతో పరీక్షలు నిర్వహించినా ఏమాత్రం తగ్గకుండా మనవాళ్లు ఎంపికయ్యారు. గతంలో సరైన టెక్నాలజీ ఉండేదికాదు. ఇప్పుడు టెక్నాలజీతో పాటు రియల్ టైం సమాచారం వచ్చింది. క్వాంటమ్ వ్యాలీ కూడా వచ్చేసింది. క్వాంటమ్ వ్యాలీ ఏంటనేది చాలా మందికి తెలీదు. ప్రస్తుతం పనిచేస్తున్న కంప్యూటర్ల కంటే వెయ్యి రెట్లు వేగంగా పని చేయడమే క్వాంటమ్ వ్యాలీ. దీనిని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఇంట్లో ఒక ఏఐ ప్రొఫెషనల్ ఉండాలి. 2047 నాటికి భారతదేశంలో అగ్రజాతిగా, ఎక్కువ ఆదాయం వచ్చే వారిగా తెలుగువారుండాలి. ప్రపంచంలో నాలెడ్జ్ ఎకానమీలో ప్రభావవంతులుగా తెలుగువారు ఉండాలి. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్రంలో 270 సేవలు పౌరులందరికీ అందిస్తున్నాం... త్వరలో ఈ సేవలు 1000కి పెంచుతామని చంద్రబాబు భవిష్యత్‌ను వివరించారు.

### ప్రధాని మోదీకి సంఘీభావంగా నిలబడాలి

'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలి. మనం చేసే ఆలోచనలు, పాజిటివ్ ఆలోచనలు ఉన్నతస్థాయికి తీసుకొస్తాయి. నేను సీఎంగా ఉన్నసమయంలో చిరంజీవి కలిశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల కోసం బ్లడ్ బ్యాంక్ పెడతాను.. స్థలం ఇవ్వాలని కోరారు. సినిమాల్లో ఉండి సామాజిక సేవకోసం మంచి ఆలోచన చేసిన మొదటి వ్యక్తి చిరంజీవి. ప్రజల్ని, విద్యార్థులను మోటివేట్ చేయడం గొప్ప కార్యక్రమం. 11 ఏళ్లుగా దేశానికి మోదీ ప్రధానిగా ఉన్నారు. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటైంది. భారతదేశం ప్రస్తుతం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. భవిష్యత్‌లో మొదటి స్థానానికి చేరుకుంటుంది. పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడిచేసి 27 మందిని పొట్టనబెట్టుకున్నారు. దేశం సుస్థిరంగా ముందుకెళ్లే సమయంలో అస్థిర పరిస్థితులు సృష్టించాలని దాడులకు తెగబడ్డారు. దీన్ని ప్రతి భారతీయుడు ఖండించాలి. దేశంలో అరాచకాలు జరిగినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి సంఘీభావాన్ని తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.' అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

చైతన్యరథం

# పీపీపీతోనే వేగంగా వృద్ధి



- స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరేందుకు సులువైన మార్గమిదే
- మూలధన వ్యయం పెరిగేలా మౌలిక వసతులపై వెచ్చించండి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

అమరావతి (చైతన్య రథం): పీపీపీ విధానంలో రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను పెద్దఎత్తున చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు సాధించాలన్నా...రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా రావాలన్నా... పీపీపీ విధానమే ఉత్తమ మార్గమని సూచించారు. గతంలో తన పాలనా కాలంలో సంస్కరణలు అమలు చేశామని, అందులో భాగంగా పీపీపీ విధానాన్ని వినియోగించి మంచిఫలితాలు రాబట్టామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గురువారం సచివాలయంలో పీపీపీ విధానాన్ని విస్తృతం చేసే అంశాన్ని అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు.

## మౌలికవసతుల ప్రాజెక్టులకు ప్రాధాన్యత

జిల్లా ఒక యూనిట్‌గా జాతీయ రహదారులను అనుసంధానిస్తూ రహదారులు నిర్మాణం, పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనలో పీపీపీ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా మరింత పెంచేందుకు పీపీపీ విధానం దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రం నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలకు పీపీపీ మద్దతుగా నిలుస్తుందన్నారు. భారత ప్రభుత్వం 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలెప్మెంట్ ఫండ్' ద్వారా రాష్ట్రాలను పీపీపీ ప్రణాళికలు రూపొందించుకునేందుకు ప్రోత్సాహిస్తుందని తెలిపారు. పీపీపీ అమలులో భూకేటాయింపులు,అనుమతుల్లో ఆలస్యం, వివాదాలు పరిష్కరించక పోవడంవంటి సవాళ్లను అధిగమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీపీపీ ఒప్పందాలను గత ప్రభుత్వం గౌరవించకపోవడం, ప్రైవేట్ భాగస్వాములను అభివృద్ధికారకులుగా చూడకపోవడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లిందన్నారు.

## ప్రభుత్వం ఫోకస్ పెట్టిన పీపీపీ ప్రాజెక్టులు

రాష్ట్రంలో 1,422 కిలోమీటర్ల పొడవైన 20 రహదారులను పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధం. సాధ్యాసాధ్యాలను బట్టి దీనిని 8,893 కిలోమీటర్లకు పెంచే వీలుంది. నూతన ప్రాజెక్టుల నిర్మాణం, ఆవిష్కరణలకు... ఎన్‌ఏబీఎఫ్ఐడీ, ఎన్ఐఐఎఫ్ కింద వివిధ సంస్థల సహాయం కోరేందుకు ప్రభుత్వ నిర్ణయం. ఖనిజ వనరులను ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.9 వేల కోట్లు ఆదాయం పొందే అవకాశం. పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు ఏపీఐఐసీ మద్దతుతో రూ.5,000 కోట్ల రుణాల సేకరణ లక్ష్యం. సుస్థిర ఆదాయాన్ని పెంచుకునేందుకు రాజధానిని అభివృద్ధి పరచాల్సి ఉంది. దేశంలో మూడవ అతిపెద్ద తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకునేలా పర్యాటకం, లాజిస్టిక్స్‌ను ప్రోత్సహించడం.

# హంపికి అభినందనలు

**- సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): అప్రతిహత విజయం సాధించి దేశం గర్వపడేలా చేసిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిని సీఎం చంద్రబాబు అభినందించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ఫైడ్' మహిళల గ్రాండ్ ప్రిక్స్ టోర్నమెంట్ టైటిల్ గెలుచుకున్న తెలుగు చెస్ ఛాంపియన్, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి హృదయపూర్వక అభినందనలు. మీరు దేశాన్ని గర్వపడేలా చేసారు. రెండవ మరియు మూడవ స్థానాలను వరుసగా కైవసం చేసుకున్న ఝు జినర్ మరియు దివ్య దేశ్‌ముఖ్‌లకు అభినందనలు. ఈ బలీయమైన త్రయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చెస్ ఔత్సాహికులకు ప్రేరణగా నిలుస్తోంది' అని పేర్కొన్నారు.

## షాహుల్ గెలుపు సమష్టి కృషి

**- సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): అండమాన్ నికోబార్ రాష్ట్రం శ్రీ విజయపురం మున్సిపల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్ షాహుల్ హమీద్ ఎన్నిక కావడం ఆనందదాయకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'ఈ విజయం దక్కడం కోసం పనిచేసిన అండమాన్ నికోబార్ దీవుల రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్ మాణిక్యరావు యాదవ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, అండమాన్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ వి మాధవ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అజోయ్ బైరాగిలకు అభినందనలు. శ్రీవిజయపురం ప్రజలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.











మున్సిపల్ మంత్రి నారాయణ కుమార్తె శరణి రచించిన 'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సినీనటుడు చిరంజీవి తదితరులు



# స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలి

- ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం అవసరం
- స్వయంప్రతిపత్తి, స్వావలంబనతో ముందుకు సాగాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు
- రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు నేరుగా నిధులు
- ప్రతి పంచాయతీలో జాతీయ సమగ్రత ప్రాంగణం, స్థూపం నిర్మించేలా ప్రణాళిక
- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్



అమరావతి (చైతన్యరథం): గ్రామ పంచాయతీలు బలంగా ఎదిగి అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి మాటకు అనుగుణంగా పల్లెలు జాతీయ సమగ్రతకు, సుస్థిరతకు కూడా మూల కేంద్రాలు కావాన్నారు. స్థానిక సంస్థలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి స్థానిక ప్రభుత్వాలుగా మారేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తనకు పల్లెలు అంటే ప్రాణం. పల్లెల్లో బతకాలని బలంగా ఉండేది.. కానీ సాధ్యపడలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను చేపట్టాను. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఏ పనికి ఏ నిధుల కేటాయింపు జరిగిందో అది పక్కాగా దానికే ఖర్చు చేయాలని అధికారులకు చెప్పాను. పారదర్శకంగా పనులు జరగాలని కూడా చెప్పాను. ఎలాంటి మళ్లింపులు, వృథా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలని చెప్పాను. దాని ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయని పవన్ తెలిపారు.

## నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లోని సిబ్బంది బదిలీలు ఎన్నడూ జరగనంత పారదర్శకంగా జరిపాం. సిఫార్సులకు, అవినీతికి తావు లేకుండా బదిలీలను పక్కాగా జరిపాం. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్నప్పటికీ నిబంధనలను అనుసరించి మాత్రమే బదిలీలు చేశాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చాం. దీని ఫలితమే నేడు పల్లెల్లో సమష్టి కృషితో పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటిని ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కృషిచేస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రశిభూషణ్‌కుమార్‌కి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పనులను వేగవంతంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు కూడా త్వరలోనే అందుతాయి. కేంద్రంలో కొన్ని ఆర్థికపరమైన అంశాల వల్ల ఆలస్యం అయింది. అవి త్వరలోనే తీరుతాయి. పాలనపరమైన అనుభవం లేకున్నా, ప్రజలకు మేలు చేయాలనే త్రికరణ శుద్ధి ఉందని పవన్ స్పష్టం చేశారు.

## రాజకీయాలకు అతీతంగా నిధులు

గ్రామ పంచాయతీలు గతంలో కులాలు, రాజకీయాలు, వర్గపోరుతో సతమతం అయ్యేవి. దీన్ని క్రమంగా అధిగమిస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామ సర్పంచుల ఆత్మగౌరవం నిలిపేలా జాతీయ పండుగల నిధులను పెంచాం. స్థానిక సంస్థల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు తగిన గౌరవం ఇస్తున్నాం. దాన్ని కొనసాగిసామని పవన్ భరోసా ఇచ్చారు.

## గత ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసింది

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు ఇంత ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం జరగలేదు. అసలు ఇలాంటి దినోత్సవం ఉందని కూడా చాలామంది మర్చిపోయారు. పంచాయతీల నిధులను గత ప్రభుత్వం ఇష్టానికి వాడేసింది. గ్రామాభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వ వచ్చిన వెంటనే ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు, రావాల్సిన నిధులను డైరెక్టుగా పంచాయతీల ఖాతాల్లో వేశాం. రూ.1,121 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను అందించడం గొప్ప విషయం. ఆర్థికంగా పంచాయతీలను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించి ముందుకు సాగేలా ప్రణాళిక రచిస్తున్నామని పవన్ తెలిపారు.

## ఉపాధి కూలీ అనొద్దు..

ఉపాధి హామీ పథకంలో పని చేసే వారిని కూలీలు అని పిలవడం కాస్త ఇబ్బందిగా ఉంది. గ్రామాల అభివృద్ధిలో చోదకులుగా పని చేస్తున్న వారిని అలా పిలవడం అంత బాగా లేదు. ఇక నుంచి ఉపాధి శ్రామికులు లేదా నేస్తాలుగా వారిని పిలుద్దాం. దీన్ని రాష్ట్రంలోని అధికారులకు తెలియజేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాను. కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో రూ.10,669 కోట్ల పనులు జరిగాయి. 13,326 గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలను చక్కగా అమలు చేశాం. 4 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 21,564 గోకులాలు, 12,950 నీటి తొట్టెలు, 20,286 ఫాం పాండ్స్‌ను అతి తక్కువ కాలంలో పూర్తి చేయడం మనందరి సమష్టి కృషికి నిదర్శనం. దీంతోపాటు పంచాయతీరాజ్ వ్యవస్థను గిరిజన గ్రామాల్లోనూ విస్తరించడం ఓ గొప్ప ముందడుగు. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా రూ.1,005 కోట్లతో 1069 కిలోమీటర్ల మేర రోడ్లను వేసి, డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి ముందడుగు వేస్తున్నాం. గిరిజన గ్రామాల్లో సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తున్నామని పవన్ తెలిపారు.

## కలప పెంచుదాం.. దేశానికి సేవ చేద్దాం

భారతదేశం ఏటా రూ.20 వేల కోట్ల కలపను దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చు అవుతోంది. పంచాయతీల్లో కలపను పెంచేలా ఓ ప్రణాళికను అమలు చేయనున్నాం. దేశ అవసరాల కోసం కలపను దేశీయంగానే అందించే ఏర్పాటు చేస్తే ఇటు పంచాయతీలకు ఆర్థిక వృద్ధితోపాటు విదేశీ మారకద్రవ్యం ఖర్చు చేయకుండా కాపాడి దేశసేవ చేసిన వాళ్లమవుతాం. దీనికి సంబంధించి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు త్వరలోనే మార్గదర్శకాలు అందుతాయి. పంచాయతీల్లో విలువైన ఖాళీ స్థలాల్లో కలపను పెంచేందుకు ప్రోత్సహిస్తాం. దీనివల్ల పంచాయతీలకు పచ్చదనంతో పాటు ఆదాయం కూడా సమకూరుతుంది. భారత దేశాన్ని దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే దేశంగా మార్చడమే లక్ష్యం. పంచాయతీలకు గతంలో ఆదాయం ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చేవారు. దాన్ని తొలగించి జనాభా ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే ఏర్పాట్లు చేశాం. పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు పెరిగాయి. 9 నెలల్లో రూ.800 కోట్ల ఇంటి పన్నులు వసూలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయని పవన్ చెప్పారు.

## పంచాయతీల స్థలాలకు ఆడిట్ జరగాలి

పంచాయతీలు స్వాతంత్రంగా, స్వయం ప్రతిపత్తి సాధించాలంటే భవిష్యత్తు అవసరాలకు భూమి అవసరం. నేను ఇటీవల రైల్వే కోడూరు నియోజకవర్గం, మైసూరవారి పల్లెకు వెళ్లినపుడు ఆ గ్రామంలో క్రీడా స్థలం ఏర్పాటు కోసం అసలు పంచాయతీ వద్ద భూమి లేదని చెప్పారు. నాకు ఆశ్చర్యం కలగింది. తర్వాత మైసూరవారి పల్లెకు క్రీడా స్థలం కోసం నా సొంత నిధులతో ప్రయివేటు స్థలం కొనుగోలు చేసి అందించాను. పంచాయతీకి భూమి లేకుంటే భవిష్యత్తు అవసరాలకు, అభివృద్ధిలో ఎలా ముందుకు వెళ్లగలం? దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి భూములపై సమగ్ర ఆడిట్ జరగాలి. ఆస్తులు, భవనాలు, అన్యాక్రాంతం అయిన భూములు అన్నింటిపై సమగ్ర ఆడిట్ చేసేలా ఓ ప్రణాళిక రూపొందించండి. పంచాయతీల భవిష్యత్తు అవసరాలకు ఇది చాలా ఉపయోగపడుతుంది. దీనిలో ఏవైనా రాజకీయ ప్రమేయాలు, సిఫార్సులు ఉంటే నేను చూసుకుంటాను. రాజకీయ అడ్డంకులు కనుక వస్తే తాను అండగా ఉంటానని పవన్ స్పష్టం చేశారు.

## గ్రామాల్లో జాతీయ సమగ్రత ప్రాంగణాలు, స్థూపాలు

గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలే కాదు.. జాతి సమగ్రతకు నిండు రూపాలు కావాలి. కాశ్మీర్‌లో పేలిన తూటా దేశాన్ని కన్నీరు పెట్టేలా చేసింది. ప్రతి ఒక్కరూ ఆవేదన చెందారు. ప్రతి గ్రామంలోనూ ఎవరెవరివో విగ్రహాలు పెడుతున్నారు. అలా కాకుండా ప్రతి పంచాయతీలోనూ ఓ జాతీయ సమగ్రత ప్రాంగణం ఉండాలి. దానిలో జాతీయ సమగ్రత స్థూపం ఉండాలి. అది వేయి గజాల్లో పెడతారా.. రెండొందల గజాల్లో పెడతారా అనేది ఉన్నతాధికారులు ఆలోచించాలి. ఈ ప్రాంగణంలో దేశం కోసం, దేశ ఐక్యత కోసం పనిచేసిన వారి ప్రతిరూపాలు ఉండాలి. దీనిపై సమగ్ర ప్రణాళికతో, శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి. దీనిపై ఉన్నతాధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తే, నేను కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తా. అవసరం అయితే ప్రధాని నరేంద్ర మోదీతో చర్చిస్తాను. అలాగే గౌరవ వేతనాలు పెంచాలని సర్పంచులు కోరారు. ఇతర సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిష్కరించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

## ఉగ్రదాడి అమరులకు నివాళులు

కార్యక్రమం జాతీయ గీతాలాపనతో ప్రారంభం అయింది. ముందుగా పహల్గాం ఉగ్ర దాడి అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ స్వాగతోపన్యాసం చేయగా, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ తమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలు, లక్ష్యాలను వివరించారు. అనంతరం పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సుమారు 15 విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన 74 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

---

# ప్రధాని పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తి

- స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలంటే అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాలి
- అవి వస్తేనే అమరావతి అభివృద్ధి పరుగులు
- అదనపు భూ సమీకరణపై నిర్ణయం తీసుకోలేదు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లు 90శాతం పూర్తయ్యాయని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను గురువారం మంత్రి నారాయణ పరిశీలించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ వచ్చే నెల 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునః ప్రారంభం అవుతాయన్నారు. సభా వేదిక వద్దకు వచ్చేందుకు అవసరమైన రోడ్లను గుర్తించాం. 11 పార్కింగ్ ప్రాంతాలు, 8 రోడ్లను గుర్తించాం. రాజధానికిగా అమరావతిని ప్రకటించిన తరువాత కేవలం 58 రోజుల్లో 34వేల ఎకరాలు భూమిని రైతులు ప్రభుత్వానికి ఇచ్చారు. ప్రధాని సభవద్ద రైతులను గౌరవించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. మొత్తం మూడు స్టేజ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అదనపు భూ సమీకరణ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నాం. ప్రజలు భూ సమీకరణకు అంగీకరిస్తే చేస్తాంలేని పక్షంలో భూసేకరణ గురించి ఆలోచిస్తాం. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే అభివృద్ధి జరుగుతుంది. అంతర్జాతీయ విమానాశ్రయంఉంటేనే అమరావతికి స్మార్ట్‌ఇండస్ట్రీస్ వస్తాయి. హైదరాబాద్‌లో ఒక ఎయిర్ పోర్ట్ ఉన్నప్పటికీ.. శంషాబాద్ విమానాశ్రయం నిర్మించారు. దానివల్లే జాతీయ, అంతర్జాతీయ సంస్థలు భారీగా తరలివచ్చాయి. రెండవ విమానాశ్రయం లేకుండావుంటే హైదరాబాద్‌లో ఇప్పుడు 10శాతం విమానాలు కూడా దిగేవి కావు. రానున్న 100 సంవత్సరాలు దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణంచేపడతున్నారు. అమరావతిలో పెరిగినభూముల విలువ నిలవాలన్నా, పెరగాలన్నా ప్రజలు ఉండాలి. ప్రజలు లేకపోతే భూముల విలువ



పడిపోతుంది. స్మార్ట్ ఇండ స్ట్రీస్ వస్తేనే అభివృద్ధి జరుగుతుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# మతం అడిగి మరీ చంపేశారు

- పహల్గామ్ దారుణాన్ని దేశం ఎన్నటికీ మరువదు
- అత్యంత కిరాతకంగా, నిర్దయగా ప్రవర్తించారు
- ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఉప ముఖ్యమంత్రి పవన్ స్పష్టీకరణ
- ఉగ్ర దాడిలో మృతి చెందిన కావలి వాసి మధుసూదనరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించిన ఉప ముఖ్యమంత్రి



కావలి (చైతన్యరథం): పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులు దారుణమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా, టార్గెటెడ్‌గా పర్యాటకుల్ని హతమార్చారు. ఎంతో పైశాచికంగా ప్రవర్తించారు. ఈ ఘటనను భారత దేశం ఎప్పటికీ మరచిపోదు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా నిర్దాక్షిణ్యంగా ఏరి వేయాలని స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలిలో పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన సోమిశెట్టి మధుసూదన రావు భౌతిక కాయానికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులు ఎంతో కిరాతకంగా దారుణంగా ప్రవర్తించారు. మధుసూదన రావు కుటుంబ సభ్యులను పరామర్శించినప్పుడు వారు పడిన క్షోభను తెలియజేశారు. వారి ఆవేదన వింటే మనసు వికలమైంది. మాట్లాడడానికి మాటలు రావడం లేదు. విశాఖ వెళ్లి చంద్రమౌళి (పహల్గాం దాడుల మృతుడు) కుటుంబ సభ్యులను కూడా పరామర్శించిన అనంతరం మంగళగిరిలో మీడియా సమావేశం నిర్వహించి అన్నీ వివరంగా మాట్లాడుతాను. ప్రభుత్వం అన్ని రకాలుగా మృతుల కుటుంబాలకు భరోసా ఇస్తుంది. పరిహారం కంటే మనిషి చనిపోయిన బాధలో వారికి అండగా నిలవడం అవసరం. కశ్మీర్‌లో పరిస్థితులు నాకు తెలుసు. 1986 నుంచి 1989 వరకు అక్కడ షూటింగ్ శిక్షణకు వెళ్లే వాడిని. కశ్మీర్‌లో తూటాలు పేలితే ఆ ప్రభావం దేశం నలుమూలలా కనబడుతుంది అనడానికి పహల్గాంలో ఉగ్రదాడి ఉదంతమే నిదర్శనం. గత కొంత కాలంగా కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు ఏర్పడ్డాయని పర్యాటకులు విహారానికి వెళ్లారు. ఇంతలోనే ముష్కరముఠా కాల్పులకు తెగబడింది. ఏ మతాన్ని ఆచరిస్తారని అడిగి మరీ నిర్దాక్షిణ్యంగా చంపేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు.

### అంతిమ యాత్రలో పాల్గొన్న మంత్రులు

మధుసూదన రావు అంతిమ యాత్రలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గారు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని టీడీపీ సహించదు

- ఇది జాతీయ భావాలు కలిగిన పార్టీ
- పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య
- ఉగ్రమూకలు ఫలితం అనుభవిస్తారు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఉద్ఘాటన
- పహల్గామ్ నరమేధానికి నిరసనగా పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ






అమరావతి (చైతన్యరథం): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధాన్ని ఖండిస్తూ టీడీపీ నేతల ఆధ్వర్యంలో టీడీపీ కేంద్ర కార్యాలయం గేటు వద్ద గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. దాడిలో పాల్గొన్న ఉగ్ర మూకల్ని వెంటాడి మట్టుపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని నేతలు కోరారు. పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య అన్నారు.

ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ లాంటి దేశాల్ని ప్రపంచం వెలివేయాలని తెలిపారు. చేసిన పాపానికి ఫలితాన్ని అతి త్వరలోనే ఉగ్రమూకలు తప్పకుండా అనుభవిస్తారన్నారు. ఉగ్రవాదుల చేతిలో అమరులైన తెలుగువారైన చంద్రమౌళి, మధుసూదన్‌రావు కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం పది లక్షల రూపాయల సాయం ప్రకటించిందన్నారు.

### భారతీయులందరూ ఒక్కతాటిపై నడవాలి: వర్ల రామయ్య

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ముష్కరులు కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై పైశాచికంగా దాడి చేసి ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. ఈ ఉగ్రవాదాన్ని ఖండించాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ ఆదేశాలమేరకు టీడీపీ ప్రధాన కార్యాలయంలో చనిపోయిన యాత్రికులందరికి సంతాపం తెలియజేశాం. ఈ ఉగ్రవాదాన్ని టీడీపీ సహించదు. భారత దేశం కన్నెర్రజేస్తే పాకిస్థాన్ ఏమవుతుందో తెలుసుకోవాలి. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ తిన్న చావుదెబ్బ మరచిపోయినట్లున్నారు. దాడులకు పాల్పడ్డ ముష్కర ముఠా ఈ విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఇలాంటి చర్యలను భారతీయులు సహించరు. టీడీపీ ఎప్పుడూ ససేమిరా సహించదు. ఎవరు, ఏ మతస్థులు అని అడిగి మరీ చంపడం చాలా దుర్మార్గం. ఈ దారుణ సంఘటనతో పాకిస్తాన్‌తో ఇండియాకు సంబంధాలు తెగి పోయాయి. వారెవరూ మన దేశానికి రావడానికి వీలులేదు. వారి ఆగడాలను చూస్తూ సహించం. ప్రతి పౌరుడు ఇటువంటి చర్యలను ఖండించాలి. అందరూ ఒక్క తాటిపై నడవాలి, ఇలాంటి సమయంలో అందరూ ఒక్క మాట మీద నిలబడాలి. పాకిస్థాన్ ఇక మనుగడ సాధించలేదు. టీడీపీ జాతీయ భావాలు కలిగిన పార్టీ. జాతితో పాటు నడుస్తుందని అధినేత చంద్రబాబు తరపున స్పష్టం చేస్తున్నా. జాతి గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక పౌరుడు సిద్ధంగా ఉండాలని వర్ల రామయ్య పిలుపు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఖబద్దార్ పాకిస్తాన్, ఉగ్రదాడిని ఖండించాలి , మృతవీరులు జోహార్, ఉగ్రవాదం నశించాలి అని నినాదాలు చేశారు.



# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ప్రతినెల జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన సమీక్ష
- ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ
- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- వక్ఫ్ బోర్డు కార్యకలాపాలపై అధికారులపై సమీక్ష




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో వక్ఫ్ బోర్డు కార్యకలాపాలపై మైనార్టీసంక్షేమశాఖ కార్యదర్శి సీ శ్రీధర్‌తో కలిసి మంత్రి ఫరూక్ సుదీర్ఘంగా సమీక్షించారు. వక్ఫ్ చట్టానికి కొత్తసవరణల నేపథ్యంలో తీసుకోవాల్సినచర్యలు, వక్ఫ్ ఆస్తుల రక్షణ, అభివృద్ధి, వక్ఫ్ ఆస్తుల లీజు ప్రక్రియ, అద్దెల పెంపు, తెలంగాణ ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు,తదితరఅంశాలపై అధికారులు, సిబ్బందితో మంత్రి ఫరూక్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీల సంక్షేమానికి ఇచ్చినఅత్యధిక ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో వేలాది మసీదులు,ఈద్గాలు, ఖబరస్తాన్ల అభివృద్ధికి ఇచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వినియోగంతో గ్రామస్థాయి నుంచి నగరస్థాయి వరకు జరిగిన సంక్షేమం, నిధులు సమర్థంగా ఖర్చు చేసిన తీరు గురించి మంత్రి గుర్తు చేశారు. ఇప్పటినుండి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం జిల్లాకలెక్టర్ల అధ్యక్షతన ప్రతినెలా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సమావేశాలు జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ప్రతి నెలా జరిగేలా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల తొలగింపు అంశాన్ని రెవిన్యూ కాన్ఫరెన్సుల్లో చేర్చి ప్రతినెల కలెక్టర్లు సమీక్షించి చర్యలు తీసుకొనేలా చూడాల్సిందిగా మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్‌ను మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, కార్యాలయ సిబ్బంది,వక్ఫ్ సర్వే జాయింట్ కమిషనర్, అన్ని జిల్లాల వక్ఫ్ ఇన్స్‌పెక్టర్లు హాజరయ్యారు.

### ఇంపాక్ట్ బృందంతో మంత్రి భేటీ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు అనుసంధానంగా నిధులను సమర్థవంతంగా రాబట్టుకునేందుకు కృషి చేస్తామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. వెలగపూడి సచివాలయం లోని తన పేషీలో ఇంటర్ మినిస్టీరియల్ ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్(ఇంపాక్ట్) బృందంతో మంత్రి ఫరూక్ భేటీ అయ్యారు. ఇంపాక్ట్ ఫౌండర్ నాగ శ్రవణ్, సీనియర్ అసోసియేట్ సభ్యులు శ్రేయన్ శెట్టి, దివినితి కొఠారి, డి.యతీన్‌ల తో కేంద్ర నిధులు రాబట్టుకోవడంపై మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సీ శ్రీధర్, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవిలతో కలిసి మంత్రి ఫరూక్ చర్చించారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం(పీఎంజేవికే), ప్రధానమంత్రి విరాసత్ కా సంవర్ధన్(పీఎం వికాస్), స్కాలర్ షిప్‌లు, జాతీయ మైనార్టీల అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎండిఎఫ్‌సి), ఏఎల్‌టి, న్యాయశాఖకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పథకాలు, కేంద్రం నుంచి నిధులు రాబట్టే విషయాలపై ఇంపాక్ట్ బృందంతో చర్చించారు. మైనారిటీ, న్యాయశాఖకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా ఆయా శాఖల కార్యదర్శులు శ్రీధర్, ప్రతిభా దేవి లను మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఇంపాక్ట్ ఏపీ సభ్యులను కేంద్ర నిధుల కేటాయింపుకు సహకరించాలని మంత్రి ఫరూక్ కోరారు.

## అండమాన్ -నికోబార్‌లో టీడీపీ మరో విజయం..

### శ్రీవిజయపురం మున్సిపల్ చైర్మన్‌గా హమీద్




అమరావతి (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాలకు వెలుపల తెలుగుదేశం పార్టీ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అండమాన్ నికోబార్ దీవుల్లో కూటమి ప్రభుత్వం మరో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. అండమాన్-నికోబార్ దీవుల్లోని మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి జరిగిన ఎన్నికలో బీజేపీ మద్దతుతో టీడీపీ అభ్యర్థి షాహుల్ హమీద్ విజయం సాధించారు. టీడీపీ-బీజేపీ ఐక్యతకు ఈ గెలుపు ఒక నిదర్శనం. బీజేపీ, టీడీపీ కూటమి ఒప్పందంలో భాగంగా గతంలో పోర్ట్ బ్లెయిర్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి టీడీపీకి చెందిన మహిళా కార్పొరేటర్ సెల్వికి దక్కిన విషయం తెలిసిందే. తాజాగా దక్షిణ అండమాన్‌లోని శ్రీవిజయపురం మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా టీడీపీకి చెందిన ఎస్.షాహుల్ హమీద్ ఎన్నికయ్యారు. బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థిగా 2022లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి 1వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలపొందారు. ఐదేళ్ల మున్సిపల్ ఛైర్మన్ పదవీ కాలంలో ఒప్పందం ప్రకారం 4వ సంవత్సరానికి టీడీపీకి చెందిన హమీద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక గురువారం అండమాన్ నికోబార్ యూనియన్ టెరిటరీలోని దక్షిణ అండమాన్‌లోని శ్రీవిజయపురం మున్సిపల్ కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. మొత్తం 24 ఓట్లలో 15 ఓట్లు సాధించి కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి అయిన సుదీప్‌రాయ్ శర్మను టీడీపీ అభ్యర్థి ఎస్.షాహుల్ హమీద్ ఓడించారు. సుదీప్‌రాయ్ శర్మకు 9 మంది సభ్యుల మద్దతు లభించింది.

ఈ విజయంతో ఎస్.షాహుల్ హమీద్ అండమాన్ నికోబార్ దీవుల చరిత్రలో శ్రీవిజయపురం మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులైన రెండవ టీడీపీ అభ్యర్థిగా చరిత్రలో నిలిచారు. ఈ విజయం.. ఆ ప్రాంతంలో టీడీపీ రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోయింది. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ వీ మాధవనాయుడు శ్రీవిజయపురంలో ఉంటూ ఎన్నికలను పర్యవేక్షించారు. ఈ విజయానికి దోహదపడిన మాధవనాయుడు, టీడీపీ బృందం, అండమాన్ నికోబార్ దీవుల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అజోయ్ బైరాగి, అలాగే ఎస్‌వీపీఎంసీ ఎన్నికల కమిటీ సభ్యులు, మొత్తం బృందానికి టీడీపీ అండమాన్ నికోబార్ దీవుల రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మాణిక్యరావు యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. కూటమికి అపూర్వమైన విజయం కట్టబెట్టారని, ఈ విజయంతో టీడీపీ శ్రీ విజయపురం, సమీప ప్రాంతాల ప్రజల ఆశలు నెరవేర్చేందుకు టీడీపీ కృషిచేస్తుందని తెలిపారు. పౌర సౌకర్యాలు మెరుగుపరచడం, ప్రతి గృహానికి ప్రాథమిక - అత్యవసర సేవలు అందేలా చూడటం, అర్హులైన పౌరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో సజావుగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ విజయం టీడీపీ, బీజేపీ కూటమిపై ప్రజల నమ్మకానికి, అండమాన్ నికోబార్ దీవుల్లో సమగ్ర ప్రజా-కేంద్రీకృత అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

## మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసు.. ప్రధాన నిందితుడు అరెస్ట్



మదనపల్లె (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లోని దస్త్రాల దహనం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లెలో ఆయన్ని గురువారం అదుపులోకి తీసుకున్నారు. గతేడాది జులై 21న రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ దస్త్రాలు దహనమైన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పలువురు ఉద్యోగులు, నేతలపై కేసులు నమోదు చేశారు.

## విడదల రజని మరిది గోపి అరెస్ట్

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి విడదల రజని మరిది విడదల గోపిని పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. కొంత కాలంగా ఆయన పరారీలో ఉన్నారు. వైసీపీ ఓడిపోయినప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోనే ఉన్నారు. ఈ క్రమంలో ఆయన హైదరాబాద్ వచ్చినట్లుగా గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. విడదల రజని ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో చిలకలూరిపేటలో మొత్తం దందాలు ఆయనే నడిపారు. యడ్లపాడులో స్టోన్ క్రషర్ యజమానుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో రజనితో పాటు ఆయన నిందితుడిగా ఉన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఐదు సంవత్సరాల పాటు ఆయన చేసిన అరాచకం గతంలో ఎవరూ చేయలేదన్న విమర్శలు నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చాయి.



చైతన్యరథం

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం

- పహల్గాం ముష్కరులపై కఠినచర్యలు
- అఖిలపక్షానికి కేంద్రం స్పష్టీకరణ
- ఈ పోరాటంలో మద్దతుగా ఉంటామని అఖిలపక్షం హామీ
- పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం



న్యూఢిల్లీ: ఉగ్రవాదం కోరలు పీకి, ఉక్కుపాదంతో అణిచివేస్తామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాంలో పైశాచిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులను వెతికిపట్టుకుని కఠినాతికఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఉగ్రవాదుల ఏరివేతలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామని అఖిలపక్షం తెలిపింది. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం రాత్రి నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగిందన్నారు. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారని తెలిపారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉంటామని అన్ని పార్టీల నేతలు చెప్పారని అని కిరణ్ రిజిజు తెలిపారు.

పార్లమెంట్ సముదాయంలోని భవనంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన రెండుగంటల పాటు ఈ కీలక బేటీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ అఖిలపక్షం తీర్మానం చేసింది. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయులు సహా వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు.

ఈ సమావేశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించామన్నారు. కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని తెలిపామన్నారు. కాశ్మీర్‌లో శాంతి నెలకొనాలన్నారు. ఇలా ఉండగా, శుక్రవారం జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ పర్యటించబోతున్నారు. పహల్గాం ఉగ్రదాడిలో గాయపడి అనంత్‌నాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించనున్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కాశ్మీర్లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు.


టీఎంసీ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నామన్నారు. ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశామని చెప్పారు..

## దేశ భద్రతలో రాజీ లేదు: లావు

దేశ భద్రత కోసం కేంద్రం తీసుకునే ఎలాంటి చర్యలకైనా టీడీపీ మద్దతు ఇస్తుందని పార్లమెంట్‌లో ఆ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు స్పష్టం చేశారు. దేశ భద్రత అంశంలో రాజకీయాలకు తావులేదన్నారు. రాజకీయం వేరు.. దేశ భద్రత వేరు అని చెప్పారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అరికట్టి సాధారణ పరిస్థితులు తీసుకురావాలన్నారు. సింధు నది జలాల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలకు టీడీపీ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. అన్ని పార్టీలు కేంద్రానికి మద్దతు తెలిపాయని వెల్లడించారు.

# తిరుమలలో హై అలర్ట్

- క్షుణ్ణంగా తనిఖీలు, విస్తృతంగా సోదాలు
- ఉగ్రదాడులపై మాక్ డ్రిల్






తిరుమల (చైతన్యరథం): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రంతో పాటు ఘాట్‌రోడ్డులో పలు చోట్ల భద్రతా సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను, అందులోని లగేజ్‌లను తనిఖీ చేస్తున్నారు. ముష్కరులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర ఇంటలిజెన్స్ హెచ్చరిక చేసిన నేపథ్యంలో తిరుమలకు వస్తున్న భక్తులందరినీ భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. అలిపిరి వద్ద నుంచే భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, భక్తులను కూడా సెర్చ్ చేసిన తర్వాతే తిరుమలకు అనుమతిస్తున్నారు. మరోవైపు తిరుమల ఘాట్ రోడ్డు, తిరుమలలో కూడా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పలు చోట్ల సోదాలు చేపడుతున్నారు. భక్తుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ.. అందులో ఏదన్నా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే విచారించిన తర్వాతే వారిని విడిచిపెడుతున్నారు. అటు తిరుమలలో కూడా గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద కూడా భద్రతను పెంచడంతో పాటు అక్కడ ఆక్టోపస్ సిబ్బందితో పహారా కాసేలా ఏర్పాట్లు చేశారు. పహల్గాంలో జరిగిన దాడి నేపథ్యంలో తిరుమల మొత్తం కూడా హైఅలర్ట్ జారీ చేశారు.






## తిరుమలలో భద్రతా దళాల మాక్ డ్రిల్

కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో గురువారం సాయంత్రం భద్రతా దళాల మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. అదనపు ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై టీటీడీ నిఘా, భద్రతా విభాగం పోలీసులకు, సివిల్ పోలీసులకు, రిజర్వు పోలీసులకు, ఆలయ సిబ్బందికి, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు.

అసాల్ట్ డాగ్ ఎనిమీ ఎటాక్, రూమ్ ఇన్టర్వెన్షన్ కార్యకలాపాలు చేసి చూపారు. దాదాపు ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్‌లో 28 మంది ఆక్టోపస్ కమాండోలు, 25 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 10 మంది ఏపీఎస్పీ సిబ్బంది భాగమయ్యారు. ఈ కార్యక్రమంలో వీజీవోలు రామ్ కుమార్,సురేంద్ర, డీఎస్పీ విజయ శేఖర్, ఏవిఎస్ఓలు, పోలీసు, ఆక్టోపస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# బిగ్ బాస్ బండారం మొత్తం బయటపెడతాం

- మద్యం స్కాంలో బాగోతాలన్నీ బయటకొస్తున్నాయి
- ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు
- పేదల బియ్యాన్ని బొక్కి పేర్ని నాని నేడు బీరాలు
- ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రాష్ట్ర పునర్నిర్మాణం
- అభివృద్ధి సంక్షేమాన్ని ఓర్వలేక వైసీపీ కుట్రలు
- మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చూపిస్తా
- ప్రజాస్వామ్యంలో అరాచక శక్తులకు స్థానం లేదు
- వైసీపీ నేతలకు మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

మచిలీపట్నం (చైతన్యరథం): ప్రజల హక్కులను హరించి అడ్డగోలుగా తప్పులు చేసిన వారు ఏదో ఒక రోజు చట్టం ముందు దోషిగా నిలబడటం తథ్యమని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతల ఐదేళ్ల అరాచకాలన్నీ ఒక్కొక్కటి బయటపడుతుండడంతో కూటమి ప్రభుత్వంపై బురద జల్లేం దుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం స్కాములో ఉన్న అసలు బిగ్‌బాస్ గుట్టు కూడా త్వరలోనే బయటపెడతామని స్పష్టం చేశారు. కుంభకోణం వెనుక చాలా మంది హస్తం ఉందని కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి చెబుతూనే ఉన్నాం. ఇప్పటికే అందుకు సంబంధించిన వివరాలను శ్వేతపత్రం ద్వారా బయట పెట్టాం. నిన్నటి వరకు వైసీపీలో నెం.2గా ఉన్న విజయసాయిరెడ్డి మద్యం స్కాం రాకెట్ మొత్తాన్ని బయటపెట్టడంతో వైసీపీ నేతల వెన్నులో వణుకు మొదలైంది. ఈ కేసులో రాజ్ కసిరెడ్డి అరెస్టయ్యారు. అయినా వైసీపీ నేతలు సిగ్గులేకుండా రాద్ధాంతం చేస్తూ అరెస్టులను రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎందెందు వెతికినా అందందు స్కాములే అన్నట్లుగా వైసీపీ పాలన సాగిందని ఎద్దేవా చేశారు. వారి స్కాము లన్నీ బయటకు వస్తుండడంతో గో మరణాలంటూ నిన్నటివరకు రాద్ధాంతం చేశారు. పరిశీలనకు రావొచ్చని కోరగా తోకముడిచారు. కోట్లాది మంది ఇలవేల్పుగా భావించే వెంకటేశ్వర స్వామిని నల్లరాయి, చెప్పులేస్తే తప్పేంటి అన్న కరుణాకర్‌రెడ్డే ఇప్పుడు తిరుమలపై రాజకీయం చేస్తున్నాడు. వక్ఫ్ చట్టానికి రాజ్యసభలో మద్దతిచ్చి బయటకొచ్చి వ్యతిరేకం అంటున్న వైసీపీ రాజకీయంపై అసహ్యం కలుగుతోంది. ప్రజలు ఛీకొట్టినా దొంగ నాటకాలు, వీధి పోరాటాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

**కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం**

జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నాశనమైన రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చుకుంటూ కూట మి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. పోలవరం, అమరావతి సహా నదుల అనుసంధానానికి నాడు శ్రీకారం చుడితే జగన్‌రెడ్డి నిలిపివేశాడు. అమరావతికి కులం ముద్ర వేసి నాశనం చేయాలనుకున్నాడు. పోలవరంపై అవినీతి ఆరోపణలు చేసి విధ్వం సం చేశాడు. అన్నీ నాశనం చేసి రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్నాడు. దాన్ని ఏం చేయా లో అర్థం కాని దుస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి రాగానే అమరావతి, పోలవ రం నిర్మాణాలను వేగవంతం చేసింది. వారి అసమర్థత కారణంగా నిర్మాణ వ్యయం పెరి గింది. దాన్ని కూడా రాజకీయం చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ డీజీగా పని చేసిన వ్యక్తి చట్టాన్ని మీరి నాటి ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ముంబైకి చెందిన ఒక సినీ నటిని చిత్రహింసలు పెట్టారు. అధికా రం ఉందని విర్రవీగితే చట్టం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

**తప్పుడు పోస్టులు పెడితే వదిలేది లేదు**

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే



వాళ్లను వదిలేయాలని వైసీపీ వారి ఆరాటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆడబిడ్డల విషయంలో తప్పుగా ప్రవర్తిస్తే ఎవరైనా ఒకటే..వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కానీ.. జగన్‌రెడ్డి మాత్రం టీడీపీ నేతలపై హత్యాయత్నం చేసినోడికి మున్సిపల్ ఛైర్మన్ పదవి, చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించిన వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చారు. టీడీపీ అంటేనే క్రమశిక్షణ, నిబద్ధత.. ప్రజల కోసం పుట్టిన పార్టీ. ప్రజలు మెచ్చేలా రాష్ట్రంలో పాలన సాగుతోంది. ఇలాంటి ప్రభుత్వంపై నిందలేయాలని, ఆరోపణలు చేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హితవుపలికారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా ఏపీలో సంవత్సరానికి రూ.33 వేల కోట్లను పెన్షన్లుగా అందిస్తున్నాం. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేశాం. నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ప్రయత్నిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రోడ్లను సాకారం చేశాం. ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించేలా పనులు చేస్తున్నాం. అభివృద్ధి చేసే వాళ్లపై బురద జల్లుతామంటే ప్రజలంతా ఏకమై తగిన ఫలితం చూపిస్తారని హెచ్చ రిం చారు. తాజాగా 16 వేల టీచర్ పోస్టులతో డీఎస్సీ ప్రకటించాం. రాష్ట్రాన్ని సుభిక్షం చేసేందుకు కూటమి అడుగులు వేస్తోంది. ఐదేళ్లు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వ కుండా డ్రామాలాడిన జగన్‌రెడ్డికి ఉద్యోగాల భర్తీ గురించి మాట్లాడే కనీస అర్హత లేదని హితవు పలికారు.

**పేర్ని నాని సమాధానం చెబుతావా?**

దొంగే దొంగ దొంగ అని అరచినట్లుగా ఉంది పేర్నినాని వ్యవహారం ఉందని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. పేదల బియ్యాన్ని పందికొక్కుల్లా దొక్కేసినోళ్లు ఎక్కడో ఏదో జరిగిపోతోందంటూ గోల చేస్తున్నాడు. ఎవరి హయాంలో మట్టి దోపిడీ జరిగిందో ప్రజలను అడిగేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గోదాముల నిర్మాణానికి మట్టి ఎక్కడి నుంచి తోలావో సమాధానం చెప్పాలి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదల భూములను అడ్డగోలుగా దోచుకుతిన్నవారు ఇప్పుడు నిందలేయడం హేయం. ఫిషింగ్ హార్బర్‌కు నిధులిచ్చింది మేము. బందరు పోర్టుకు భూ సేకరణ చేసి పనులు ప్రారం భించింది మేమే. విజయవాడ మచిలీపట్నం రోడ్డు నిర్మించింది మేమే. గత ఐదేళ్లలో అధికారులను బెదిరించడం, ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం తప్ప సాధించిం దేమీ లేదు. తప్పు చేసినోళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**మచిలీపట్నం అభివృద్ధికి ప్రణాళికలు**

మచిలీపట్నం సంస్కృతిని చాటి చెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నాం. డ్రైనేజీలన్నింటిలో కూడా సిల్ట్ తొలగింపునకు టెండర్లు పిలిచాం. మురికి కాల్వలు శుభ్రం చేస్తాం. మున్సి పల్ కార్యాలయం, బేబీ సెంటర్, పాత రైతు బజార్ సీఎస్ఆర్, పిపిపి పద్ధతిలో అభివృ ద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించాం. శ్మశాన వాటికల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. చిలకలపూడి శ్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రీన్ కో సంస్థ ముందుకు వచ్చింది. ఇక్కడి నుంచి వెళ్లి దేశ విదేశాల్లో స్థిరపడిన వారు కూడా సొంత ప్రాంత అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం. డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించి ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటు పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయబోతున్నాం. పీ 4 కార్యక్రమం ద్వారా పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మచిలీపట్నం అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వా ములు కావాలి. బందరుకు నయా రూపాన్ని సంతరించేందుకు తోడుగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# ఆన్‌లైన్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్

- ఆచార్య యాప్‌తో అభ్యర్థులకు శిక్షణ
- ప్రారంభించిన బీసీ సంక్షేమ మంత్రి సవిత
- 24 గంటలూ యాప్ ఓపెన్ చేయొచ్చు
- మెటీరియల్, నిష్ణాతులతో బోధనలు లభ్యం



అమరావతి (చైతన్యరథం): బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం కాకినాడకు చెం దిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఆచార్య యాప్ రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా 24 గంటల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. గురువారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆన్‌లైన్ ఉచిత డీఎస్సీ కోచింగ్ ను మంత్రి ప్రారంభించారు.

అభ్యర్థులు రోజులో ఎన్ని పర్యాయాలైనా యాప్‌ను ఓపెన్ చేసేలా రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్‌లో నిష్ణాతులైన అధ్యాపకుల బోధనలు, అన్ని సబ్జెక్టులకు చెందిన మెటీరియల్స్, పాత డీఎస్సీ క్వశ్చన్ పేపర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. యాప్ చార్ట్ బాక్స్ రూపొందించామని, ఆ బాక్స్‌లో సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు తెలిపితే తక్షణమే సిబ్బంది స్పందించి సమాధానాలు చెబుతారని వివరించారు. టెక్నికల్ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతి జిల్లాకు ఇద్దరిని నియ మించినట్లు చెప్పారు. ఆ ఇద్దరితో వాట్సాప్ గ్రూప్ రూపొందించామని, టెక్నికల్ సమ స్యలు ఆ గ్రూప్‌లో చెబితే వారు పరి ష్కరిస్తారని వెల్లడించారు.

ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నెరవేర్చుతూ 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. డీఎస్సీ ద్వారా అత్యధిక ఉపా ధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్న లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించామన్నారు. ఈ కేంద్రాల ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేశామన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.1500 స్టైఫండ్‌తో పాటు మరో రూ.1000 పుస్తకాల కొనుగోలుకు అంద జేశామన్నారు.

**ఆన్‌లైన్ కోచింగ్‌కు అందరూ అర్హులే...**

ఆఫ్‌లైన్‌లో కోచింగ్ పొందలేని గృహిణులు, సుదూర ప్రాంతవాసులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చేసే వారితో ఆర్థికంగా ఉన్న వెనుకబడిన వారికి లబ్ధి కలిగే విధంగా ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరికీ ఉచిత కోచింగ్ అందజేస్తామన్నా రు. ప్రస్తుతం 3,189 మంది దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌కు ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ పొందిన డీఎస్సీ అభ్యర్థులు కూడా అర్హులేనని వెల్ల డించారు.

మెగా డీఎస్సీ పోస్టుల భర్తీలో అత్యధిక మంది బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు విజయం సాధించడమే లక్ష్యంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. అం తకుముందు కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులతో సెల్ఫీలో యాప్‌ను డౌన్ లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, జేడీ తునాజారాణి, శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులకు మాదిగల భూములు

- ఆన్‌లైన్ చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా శూన్యం
- న్యాయం చేయాలని బాధితుల వినతి
- అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజా వినతుల కార్యక్రమంలో మంత్రి సవిత, ప్రభుత్వ సలహాదారు షరీఫ్ అర్జీలు స్వీకరించారు. మాదిగలమైన తమ భూములను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న బి.మహేశ్వర్ రెడ్డి వైసీపీ నాయకులకు అక్రమంగా ఆన్‌లైన్ చేశారని అన్నమయ్య జిల్లా టి.సుండు పల్లె మండలానికి చెందిన వై.రామచంద్ర తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుల అండతో నరసాపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అప్పటి సబ్‌రిజిస్ట్రార్ వీరభద్రరావు తమ ఆస్తిని తప్పుడు నెంబర్ల తో తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన పాలకొలను నవీన్ ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని తనపై దుర్భాషలాడి దాడి చేసి తన మెడలోని 3 కాసుల బంగారు సూత్రం, నాన్ తాడు, ఇంటి పట్టాను తీసుకెళ్లిపోయా రని ఏలూరుకు చెందిన పి.పెద్దింట్లు ఫిర్యాదు చేశారు. మోటూరి రమణమ్మ, మోటూ రి రంగబాబులపై చర్యలు తీసుకుని వారు తీసుకెళ్లిన తన ఇంటి పట్టాను, బంగారు ఆభరణాలను తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

తమ పొలంలోకి ఎం.రామస్వామి, ఎం.రవికుమార్ వారి పిల్లలు అక్రమంగా వచ్చి పొలం వారిదని కొడుతున్నారని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారు మంచి గ్రామానికి చెందిన మేడికొండ పున్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము కోర్టుకు వెళితే కోర్టు తమకే సానుకూలంగా తీర్పు ఇచ్చిందని.. కోర్టు ఆదేశా లను అధికారులు సక్రమంగా అమలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తమ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఏపీ హైకోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదని నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామానికి చెందిన కె.వెంకటరత్నం ఫిర్యాదు చేశారు. దాంతో తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునే యత్నం జరుగుతుందని వివరించారు.

తమ గ్రామంలో పల్లె పండుగ కింద దాదాపు రూ.20 లక్షల విలువైన సీసీ రోడ్ల పనులు చేశామని..ఆ బిల్లులు మంజూరు చేసేలా చూడాలని నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన దూదేకుల సిద్దయ్య విజ్ఞప్తి చేశారు.

తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని మల్లెల సూరి అనే వ్యక్తి ఆక్ర మించుకునేందుకు యత్నిస్తున్నాడని అనంతపురం జిల్లా శింగనమల మండలం ఆకు లేడు గ్రామానికి చెందిన సి.చిన్నఓబులేసు ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యలు తీసకోవాలని అర్జీ ఇచ్చారు.

ఆకేపాటి సోదరులు ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం విడిపించి స్వాధీనం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలానికి చెందిన చుండు సుధీర్ ఫిర్యాదు చేశాడు.

తమ గ్రామంలోని నూకాంబిక అమ్మవారి దేవస్థానం, శివాలయంలో జరుగు తున్న అక్రమాలపై విచారణ జరిపి ఈవోను నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండల కేంద్రానికి చెందిన రాజు విజ్ఞప్తి చేశారు.







# ప్రభుత్వ సలహాదారుడిగా సతీష్‌రెడ్డి బాధ్యతలు

- డిఫెన్స్ క్లస్టర్స్‌కు కృషి చేస్తానని వెల్లడి
- పదవికి ఎంపిక చేసిన సీఎంకు కృతజ్ఞతలు
- ఆయన అనుభవం ఏపీకి అవసరం: కేశినేని



అమరావతి (చైతన్యరథం): మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం ఏరో స్పేస్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హాజరయ్యారు. సతీష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అం దించి శు భాకాంక్షలు తెలిపారు. జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఏరో స్పేస్ డిఫెన్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ హబ్‌కు తనని గౌరవ సలహాదారుడిగా నియమించినందుకు ముఖ్య మంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంటరీ స్టాం డింగ్ కమిటీ మెంబర్‌గా ఉంటూ జాతీయస్థాయిలో పారిశ్రామికవేత్తలను కలిసి రాష్ట్రా నికి పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరందరి సహకారంతో చాలా త్వరగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ముందునిలబెడుతున్నాయి. తనకు ఏరో స్పేస్ డిఫెన్స్ రంగాల్లో ఉన్న అనుభవంతో రాష్ట్రంలో ఎక్కడెక్కడ డిఫెన్స్ క్లస్టర్స్ ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. విజయవాడ, అమరావతి ప్రాంతాల్లో హైదరాబాద్ వెళ్లే మార్గం, అనంతపురం, విశాఖపట్టణం, కర్నూల్, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమ లు అభివృద్ధి చెందేందుకు పుష్కలంగా అనేక వనరులు ఉన్నాయన్నారు. ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాష్ట్రానికి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలు రావాలని ఆకాంక్షించారు. ఆయన అనుభవాన్ని రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా ఏరో స్పేస్ డిఫె న్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గత ఎనిమిది నెలల్లో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకురావటం జరిగిందన్నారు. డిఫెన్స్ పరిశ్రమలను రాష్ట్రంలో ప్రోత్సహించేందుకే సతీష్‌రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించటం జరిగిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు విషయంలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు చెందిన పరిశ్రమలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అమరావతిలో క్రికెట్ స్టేడియానికి స్పోర్ట్స్ సిటీతో పాటే స్థలం కేటాయింపు జరుగుతుందని వివరించారు. స్థలం కేటాయింపు జరిగిన వెం టనే రెండేళ్లలో క్రికెట్ స్టేడియం పూర్తి చేస్తామని ఎంపీ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పా రు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చంద్రమౌళి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

**అందజేసిన మంత్రి డోలా, ఎంపీ భరత్ - దేశం మొత్తం అండగా ఉంటుందని భరోసా**

విశాఖపట్నం (చైతన్యరథం): జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన విశాఖ వాసి చంద్రమౌళి కుటుంబసభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసిం ది. గురువారం విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.భరత్, ఎమ్మెల్యే వెలగపూడి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ పాండురంగాపురంలోని చంద్రమౌళి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులకు రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని విషాదంలో నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా విశాఖ వచ్చి చంద్రమౌళి కుటుంబానికి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఉగ్రదాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు యావత్ దేశం మొత్తం అండగా ఉంటుందని తెలిపారు.

# పూడికతీత పనులకు భూమిపూజ

## అధికారులతో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

రాజవొమ్మంగి, (చైతన్యరథం): మండలంలో పలు అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా గురువారం రాజవొమ్మంగి మండలంలో రేవడిపాలెం, మేలిన వారి వీధి, శరభవరం, మారేడుబాక, బలిజపాడు, పెద్ద రేలంగి పాడు మరియు మద్ది బందల గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు రంపచోడవరం నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ కుటుంబ పార్టీల శ్రేణులతో భూమి పూజ చేశారు. అదేవిధంగా మడేరు ఆనకట్ట, దోనెలపాలెం, ఉర్లాకులపాడు గ్రామాల్లో ఇరిగేషన్ ద్వారా పూడికతీత పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండల ప్రజలు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్ కేశవ్, శివాజీ, లోతా లక్ష్మణరావు, జి తాతారావు, బి త్రిమూర్తులు, అంకం రవి, రత్నం, మాణిక్యం, సుందరం, అనుదీప్, గంగ, సత్తిబాబు, అధికారులు సచివాలయ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







సాలూరు పట్టణం 26వ వార్డులో పైలట్ వాటర్ స్కీమ్‌ను రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు





# పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం

## ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి
## మృతుల కుటుంబాలకు సంఘీభావంగా క్రొవ్వొత్తుల ర్యాలీ



గుమ్మలక్ష్మీపురం, (చైతన్యరథం): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై తీవ్రవాదులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి తోయక జగదీశ్వరి గారు అన్నారు. మృతుల కుటుంబాలకు సంఘీభావంగా గురువారం సాయంత్రం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో గాంధీ విగ్రహం నుండి ఎల్విన్ పేట కూడలి వరకు పహల్గాం ప్రాంతంలో ముష్కరుల దాడిలో మృతి చెందిన 26 మంది పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై ముష్కరులు దాడిచేయడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారిలో ఇద్దరు తెలుగువారు ఉండటం తనకు కలిచివేసిందని ఎమ్మెల్యే గారు అన్నారు. అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రదాడి చాలా హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, ఏఎంసి ఛైర్పర్సన్ కడ్రక కళావతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు చిన్న, రాజేష్, దొరబాబు, దివాకర్, శివ, మన్మధ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోలాహలంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

అనకాపల్లి, (చైతన్యరథం): అనకాపల్లి మండలం చిన అగ్రహారం, రేబాక గ్రామాలు, కశింకోట మండలం చెరకాం, తీడ గ్రామాలలో టీడీపీ పార్టీ సంస్థాగత ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు అనకాపల్లి మండలం సీహెచ్ అగ్రహారం, రేబాక గ్రామాలు కశింకోట మండలం చెరకాం, తీడ గ్రామాలలో జరిగిన టీడీపీ పార్టీ సంస్థాగత ఎన్నికలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణుల మధ్యే టీడీపీ గ్రామ బూత్ కమిటీలన ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా చెరకాం గ్రామ టీడీపీ ప్రెసిడెంట్‌గా బందారు అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా చుక్క చిరంజీవి తీడ గ్రామ టీడీపీ ప్రెసిడెంట్‌గా మేడి శెట్టి సన్యాసి నాయుడు,ప్రధాన కార్యదర్శిగా చిరికి సన్యాసి నాయుడులతో ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.





చల్లపల్లి బైపాస్ రోడ్ లో శారద గ్రాండియర్ ఫంక్షన్ హాల్‌జరిగిన అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి, వాసంశెట్టి సుభాష్ కొనకళ్ళ నారాయణరావు, కనపర్తి శ్రీనివాసరావు మండల పార్టీ అధ్యక్షులు తదితర ముఖ్యనాయకులు

# పిరికిపందల్లా అమాయక పర్యాటకులను కాల్చి చంపారు

## దమ్ముంటే భారత సైన్యంతో పోరాడండి
## ఉగ్రదాడిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందన
## ఉగ్రదాడిలో మృతులకు నివాళి.. కుటుంబ సభ్యులకు సానుభూతి

కనగానపల్లి, (చైతన్యరథం): జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదులు పిరికిపందల్లా నక్కి నక్కి దాక్కుని అమాయకమైన పర్యాటకుల మీద దాడి చేసి చంపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గామ్ ఘటనలో మృతి చెందిన వారికి ఆమె కన్నీటి నివాళి అర్పించారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కనగానపల్లితో పాటు రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధికారులు, టీడీపీ నాయకులతో కలసి ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం మృతులకు ఆత్మశాంతి కలగాలని కాసేపు మౌనం పాటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ ఘటనలో భర్తలను కోల్పోయి తల్లిడిల్లిన మహిళల రోదనలు తనను తీవ్రంగా కలిచి వేశాయని.. కొందరు కుటుంబ పెద్దను కోల్పోయి అనాథలుగా మారారన్నారు. ప్రధాన మంత్రి మోడీ నాయకత్వంలో జమ్మూ కాశ్మీర్ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే చూసి ఓర్వలేక.. ఇలాంటి దాడులతో అక్కడ అలజడులు సృష్టించాలని చూశారన్నారు. భారతదేశం మీద కోపం ఉంటే అమాయక ప్రజలను బలి తీసుకోవడం కాదని.. దమ్ముంటే భారత సైన్యంతో పోరాడాలన్నారు. అప్పుడు తెలుస్తుంది ఎవరు ఏంటో అని సునీత అన్నారు. ఇప్పటికే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా.. ఈ దాడి పట్ల తీవ్రంగా స్పందించారని.. భారత్ అనుకుంటే ఏం చేస్తుందో ఇప్పటికీ పాకిస్థాన్ కి ఒక క్లారిటీ వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కచ్చితంగా దీనికి మర్చిపోలేని సమాధానం ఉంటుందన్నారు. మరోసారి భారత్ వైపు చూడాలంటేనే భయపడే విధంగా మోదీ చర్యలు తీసుకోవాలని.. యావత్ దేశం ఆయన వెంట ఉంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.





# పాలకొల్లులో తాగునీటి వెల్లువ

## రూ 2.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు

పాలకొల్లు, (చైతన్యరథం): పాలకొల్లు నియోజకవర్గంలో రూ 80 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరుని ఇంటింటికి అందించే బృహత్రా కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన గురువారం యలమంచిలి మండలంలో మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో రూ రెండు కోట్ల 20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 29 లక్షలతో చింతదిబ్బ గ్రామంలో నక్కల కలవర్ట్ వద్ద నక్కల మేజర్ డ్రైన్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన,మరో 25.30 లక్షలతో మైనర్ డ్రైన్స్ త్రవ్వ పనులు ప్రారంభం, 21.75 లక్షలతో నారిన మెరక గ్రామంలో ఇలపకుర్రు చానల్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు,27.50 లక్షలతో నారిన మెరక గ్రామంలో గ్రామ పంచాయతి దగ్గరలో జల జీవన్ మిషన్ త్రాగునీటి పథకం పనులకు, 34.40 లక్షలతో గంగడు పాలెం గ్రామంలోగ్రామ పంచాయతి దగ్గరలో జల జీవన్ మిషన్ త్రాగునీటి పథకం పనులకు, 53.30 లక్షలతో గంగడు పాలెం గ్రామంలో వడ్డి లంక చానల్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, 10.50 లక్షలతో లక్ష్మీ పాలెం గ్రామంలో బ్యాంక్ కెనాల్ పటిష్ట (సి.సి. వాల్) పనులకు, 22 లక్షలతో లక్ష్మీ పాలెం గ్రామంలో బ్యాంక్ కెనాల్ చివర జల జీవన్ మిషన్ త్రాగునీటి పథకం పనులకు కూటమి నాయకులతో కలిసి



భూమి పూజ జరిపి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, ప్రజలు ముఖ్యంగా పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నామన్నారు. రైతాంగానికి మేలు జరిగే పనులకు ప్రాధాన్యతనిస్తూ 42 కోట్లతో పలు అభివృద్ధి పనులు సరవేగంగా జరుగుతున్నాయి అన్నారు. ప్రధానంగా వంటకాలవల వెంబడి గ్రావెల్ రహదారి నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రూ ఎనిమిది కోట్లతో గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులు జరుగుతున్నాయని, మరో 8 కోట్లతో ఎలమంచిలి నుంచి చించినాడ వరకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే ఆ పనులు మొదలు పెడతామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో కంచి స్తంభం పాలెం నుంచి బాడవ వరకు గోదావరి ఏటిగట్టు ను పటిష్ట పరుస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో గోదావరి వరదలు వస్తే నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని, వరద నివారణ చర్యలను గ్రామస్తులే స్వచ్ఛందంగా చేపట్టారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు తీసుకువస్తున్నానని, ప్రతిరోజు అభివృద్ధి పనులు మొదలవుతున్నాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పడే తపనను అర్థం చేసుకొని భవిష్యత్తులోనూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి రామానాయుడు కోరారు. ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి ఆర్థిక పరిస్థితిని అప్పులపాలు చేసిన జగన్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు అన్నారు. వైకుంఠపాళీ మాదిరిగా చంద్రబాబు మన అభివృద్ధి కోసం ఒక్కొక్క మెట్టు పైకి తీసుకు వెళుతుండగా జగన్ పాముల కాటు వేసి కిందకు తీసుకువచ్చేస్తున్నాడని దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పాడి రైతులకు మేలు చేయండి

## - పశుసంవర్ధక శాఖ ఏడీలతో ఎమ్మెల్యే ప్రశాంతి సమీక్ష

కోవూరు, (చైతన్యరథం): నియోజకవర్గంలో పాడి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని విపిఆర్ నివాసంలో పశుసంవర్ధక శాఖ ఏడీలు, పశువైద్యశాల డాక్టర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన దానా అంశం, పాడి అభివృద్ధిపై సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న పశువుల దాణాపై ఎమ్మెల్యే ప్రశాంతిబరెడ్డి ఆరా తీశారు. ప్రస్తుతం మండలానికి 5.6 టన్నుల ఫీడ్ అందనుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రస్తుతానికి ఒక్కో పాడి రైతుకు ఒక బ్యాగ్ చొప్పున అందిస్తామని వివరించారు. పశువుల దానాకు సంబంధించి ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి మండలానికి ఫీడ్ అందేలా





చూడాలన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న దానాపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆమె తెలియజేశారు. అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన మినీ గోకులాల పురోగతిపై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆరా తీశారు. మినీ గోకులాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. అలాగే అధికారులు ప్రజలు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏడి మురళీకృష్ణ బుచ్చిరెడ్డిపాలెం మండల ప్రసన్నాంజనేయరెడ్డి కోవూరు కృష్ణమోర్య మారియ అలాగే పశు వైద్యశాలల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

దర్శి, (చైతన్యరథం): మండల కేంద్రమైన ముండ్లమూరులో గురువారం సాయంత్రం 11 లక్షల 50 వేల రూపాయల విలువైన ట్రాక్టర్ గొర్రు సెట్టు పనిముట్లను సబ్సిడీపై దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేతులు మీదగా పంపిణీ జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మిర్చి రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మాత్యులు అచ్చం నాయుడు మాట్లాడడం జరుగుతుందని ఆమె వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ఈ పది నెలల కాలంలో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారి చేయడం ఇలా సాంకేతికతను రైతులకు అందించి వ్యవసాయాన్ని లాభాల బాటలో తీసుకు వెళ్లే లక్ష్యంతో మన ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. త్వరలో మన వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్ కూడా నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖా అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, మండలం లోని వివిద హెూదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు క్లస్టర్స్, యూనిట్ బూత్ ఇంచార్జ్‌లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# మారుతున్న పల్లెల రూపురేఖలు

## ప్రభుత్వ శాఖల పనితీరును మెరుగుపరిచిన పవన్ కల్యాణ్ : మాజీమంత్రి ప్రత్తిపాటి

## - కుట్టుపని నేర్చుకొని మిషన్లు పొందిన బీసీ మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

నాదెండ్ల, (చైతన్యరథం): గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ పనితీరును పవన్ కల్యాణ్ మెరుగుపరిచారని, గతంలో ఆ శాఖను నారాలోకేశ్ సమర్థవంతంగా నిర్వహించి జాతీయస్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నాదెండ్ల మండలంలోని సాతులూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం వెనుకబడిన వర్గాల మహిళలకు మాజీమంత్రి స్వయంగా కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులను ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.. పల్లెల రూపురేఖలు మార్చేందుకు పవన్ శ్రమిస్తున్నారన్నారు.



దేశ ముఖచిత్రాన్ని మార్చడంలో గ్రామసీమలు ముఖ్యపాత్ర పోషిస్తాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గట్టిగా నమ్ముతున్నారని, అందుకే పల్లెల రూపురేఖలు మార్చేందుకు ఆయన శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజ్ లు, వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని ప్రత్తిపాటి కొనియాడారు. కేంద్ర పథకమైన జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టేందుకు పవన్ కల్యాణ్ ఎంతో కృషిచేశారన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అందరూ మనస్ఫూర్తిగా స్వాగతించాలన్నారు. కుట్టుపనిలో మంచి మెళకువలు సాధించి, తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు, ఆర్థికంగా స్థిరపడేలా, మరో నలుగురికి ఉపాధి కల్పించేలా కుట్టుమిషన్లు పొందిన మహిళలు రాణించాలని ప్రత్తిపాటి సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు ఉపాధికార్యక్రమాలు అమలుచేస్తోందని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి సూచించారు. మహిళలకు ఉచితంగా కుట్టుపని నేర్పించి, ప్రభుత్వం ఉచితంగా మిషన్లు అందచేస్తోందన్నారు. మండలస్థాయిలో ఉచిత శిక్షణ పొంది మిషన్లు తీసుకున్నవారంతా తమజీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. మిషన్లు పొందిన మహిళలతో మాట్లాడిన ప్రత్తిపాటి, ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత అందితే పేదకుటుంబాలు బాగుపడతాయనే దానిపై వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సహకారంతో మహిళలకు ఉపాధి కల్పన దిశగా కృషి చేసిన బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈ.డబ్ల్యూఎస్ విభాగం సిబ్బందిని మాజీమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప రాణి, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, వలేటి హిమామంతరావు, ముసుకు శోభారాణి, కమ్మ శ్రీనివాసరావు, తుపాకుల అప్పారావు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు,చుండు అనిల్, అనితా భాయి, తదితరులున్నారు.



జోన్-3
మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట
చైతన్యరథం

# ప్రజల కోసం పని చేయండి

### గత పాలకుల విధ్వంసాన్ని ఎండగట్టండి, మాజీమంత్రి ప్రత్తిపాటి పిలుపు

చిలకలూరిపేట, (చైతన్యరథం): ప్రజలు, రాష్ట్రం కోసం ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని, గత పాలకుల విధ్వంసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత తెలుగుదేశం శ్రేణులదేనని, పదవులు పొందినవారంతా జనం తలలో నాలుకలా వ్యవహరించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని 7వ వార్డుకు, 19వ వార్డుకు నూతనంగా ఎన్నికైన సభ్యులను తెలుగుదేశం కార్యవర్గాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. 7వ వార్డు అధ్యక్షుడు షేక్ బాజీ, కార్యదర్శి పాపారావు, 19వ వార్డ్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, కార్యదర్శి ఏసుబాబు, సహా ఇతర సభ్యుల్ని సన్మానించారు. త్వరలోనే పట్టణంలోని అన్నివార్డులు, మండల, గ్రామస్థాయి కార్యవర్గాల ఎంపిక కూడా పూర్తవుతుందని, పార్టీ పదవులు పొందినవారు బాధ్యతతో ప్రజలకోసం పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. జనం కష్టసుఖాల్లో తోడుగా ఉండి, పార్టీ.. ప్రభుత్వ పనితీరుని వారికి వివరించాలని ప్రత్తిపాటి చెప్పారు. నిత్యం ప్రజలతో ఉంటూ, ఎప్పటికప్పుడు వారితో మమేకమయ్యేవారికి టీడీపీలో ఎప్పటికీ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కష్టపడే కార్యకర్తలను తెలుగుదేశం అమితంగా గౌరవించి ఆదరిస్తుందనే వాస్తవాన్ని నూతన కార్యవర్గం గుర్తుంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. భేషజాలు, పట్టింపులకు చోటులేకుండా స్వపక్షంతో పాటు, మిత్ర పక్షాల శ్రేణుల్ని కలుపుకొని ప్రజలకోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, పఠాన్ సమద్, ఏలూరి తిరుపతయ్య, మున్నంగి రత్నారెడ్డిగారు, నసిమా బేగం, షేక్ జాకీర్, సయ్యద్ రఫీ, షేక్ సైదు, షేక్ మస్తాన్ వలీ, గుర్రం శ్రీనివాసరావు, షేక్ జహంగీర్, షేక్ బషీర్ గారు, షేక్ కరీముల్లా, నూర్ భాషా సాయి ముత్తయ్య, సయ్యద్ వలి, షేక్ నాగూర్, సయ్యద్ అయేషా, పునాటి సుబ్బారావు పొన్నం సురేష్, షేక్ రియాజ్, బుడ్డయ్యకుంట కోటేశ్వరరావు, కృష్ణవేణి, మోమిన్, కరీముల్లా, శ్రీరామ్, ఖలీల్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.






తాడిగడప మున్సిపాలిటీ పోరంకి ద్వారకా రెసిడెన్సీలో అనుమోలు ప్రభాకరావు ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ ఆయన సతీమణి బోడే హేమ ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరావు ఆయన సతీమణి అనుమోలు లక్ష్మి మహిళా కార్యకర్తలు అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన

### అధికారులతో నూర్‌బాషా ప్రతినిథుల చర్చలు సఫలం

అమరావతి, (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో గురువారం నూర్‌బాషా దూదేకుల సమస్యలపై అధికారులతో టీడీపీ నూర్ భాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ ఆధ్వర్యంలో జరిగినచర్చల్లో నూర్ భాషా టీడీపీ నాయకులు టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, బాషా ఫెడరేషన్ మాజీ చైర్మన్ డా. బాబన్ టీడీపీ నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ సుభాన్,రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా, నూర్ బాషా సంఘం యువ నాయకులు షేక్ ఆరిఫ్, నూర్ బాషా సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ఇబ్రహీం,షేక్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి శ్రీధర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి సత్యనారాయణను కలిశారు. నూర్ భాషా దూదేకుల ముస్లింలు ఎదుర్కొంటున్న అనేక సామాజిక అంశాలపై, సమస్యలపై వారితో చర్చించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నూర్ భాషా ముస్లిములకు ఇచ్చిన హామీల అమలుపై చర్చ జరిగినది. దానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వంద కోట్లు రూపాయలు కేటాయించడం, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో నూరుబాషాల జనగణన చేపట్టడం, మైనారిటీ హోదాకు గతంలో ఇచ్చిన సర్క్యులర్లకు సంబంధించిన వాటిని జీవోలుగా ఇవ్వడం, మైనార్టీలకు వర్తించే పథకాలన్నీ నూర్ భాషాలకు వర్తింపు చేయడం తదితర విషయాలను చర్చించారు. అధికారులతో చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగి సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులు. త్వరలో సమస్యల పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీని ఇచ్చారు. అధికారులకు నూర్ భాషా కులం తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.



### ఘనంగా మంత్రి రామానాయుడు కుమార్తె శ్రీజ పుట్టినరోజు

## పేదలకు భారీగా అన్నదానం

పాలకొల్లు, (చైతన్యరథం): మంత్రి రామానాయుడు కుమార్తె శ్రీజ పుట్టినరోజు సందర్భంగా గురువారం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలు, రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ అందరి సమక్షంలో శ్రీజ కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. మంత్రి రామానాయుడు, సూర్య కుమారి దంపతులు శ్రీజ ను ఆశీర్వదించారు. పేదలకు స్వీటు, పలావ్, అన్ని రకాల కూరలతో భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఆస్పత్రి నర్సులకు శ్రీజ చేతుల మీదగా పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పేదలకు ఆకలి తీర్చడంలోనే అసలైన సంతృప్తి కలుగుతుందని, అందుకనే ప్రతి ఏటా నా కుమార్తె, కుమారుడు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.



# బలహీన వర్గాలకు సబ్సిడీలు అందాలి

### అధికారులకు మంత్రి సుభాష్ ఆదేశం

మచిలీపట్నం, (చైతన్యరథం): మచిలీపట్నంలో గురువారం జరిగిన కృష్ణాజిల్లా సమీక్ష సమావేశంలో ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మాట్లాడుతూ దేశానికే వెన్నుముకగా నిలిచే రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ముందుగా ఆయన జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునిక పద్ధతులు విధివిధానాలతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. ముఖ్యంగా పంట సబ్సిడీల విషయంలో రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని.. అయితే చాలామంది సబ్సిడీలపై అవగాహన లేక వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. సబ్సిడీలు పొందలేని వారిలో ప్రధానంగా వినబడిన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీలు ఉండడం బాధాకరమన్నారు. జిల్లా అధికారులు ఒక బాధ్యతగా తీసుకొని సబ్సిడీలు ప్రతి ఒక్కరూ పొందేలా వారికి అవగాహన కల్పించాలన్నారు.




రైతు లకు పంట బీమా పై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈసారి కేవలం 3500రైతులు మాత్రమే ఇన్సూరెన్స్ కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పొరపాటున వాతావరణం అనుకులించక నష్టం పోతే రైతులకు పంట భీమా రక్షణగా ఉంటుందని.. భీమా విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని మంత్రి అన్నారు. అదే విధంగా ఎమ్మెల్యేలకు పిషరీస్ అధికారులు సమాచారం ఇవ్వకుండా గ్రామ సభలను నిర్వహించడం సరికాదు అని ప్రజాప్రతినిధులుకు సమాచారం అందించి సమన్వయం చేసుకుంటూ ఆక్వా గాని నాన్ అక్వా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.పశు భీమా 95%క్లయిమ్ లో మొదటి స్థానంలో ఉండడం సంతోషకరమని మంత్రి అన్నారు. దింతో పాటు జిల్లాలో శ్రమ పోర్టల్‌లో నమోదు కావడం వలన వారికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా లేబర్ కాంట్రాక్టర్లు కూడా చాలావరకు శ్రామికులకు ఈఎస్ఐ సరిగా చెల్లించడం లేదని తన దృష్టికి వచ్చిందని. దీని పట్ల జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఉగ్రదాడి పిరికిపందల చర్య

## టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు, (చైతన్యరథం): కాశ్మీర్ లో ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్ భౌతికకాయానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సత్యకుమార్ యాదవ్ తదితరులతో కలిసి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యలను పరామర్శించారు. కాశ్మీరులో ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అన్నారు. మతం పేరు అడిగి చంపేయడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులు కానీ వారిని ప్రోత్సహించే సంస్థలు గానీ దేశానికి ధైర్యముంటే నేరుగా వస్తే ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉందన్నారు. భార్యాబిడ్డలతో విహారానికి వచ్చిన వారిని మతం, దేశం పేరు అడిగి చంపేసే పిరికి వాళ్లను ఎప్పుడూ చూడలేదన్నారు. మతాలకు అతీతంగా ప్రపంచమంతా ఈ ఘటనను ఖండిస్తోందన్నారు. మనుషులను చంపేసి మోదీకి చెప్పుకోండని చెప్పిన ముష్కరులు అసలు మనుషులేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం జోలికి వచ్చినోళ్లను ప్రధాన నరేంద్రమోదీ ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టరన్నారు. పాపాత్ములు ఫలితం అనుభవింక తప్పదని హెచ్చరించారు.కనీసం చనిపోయిన వారికి సానుభూతిని కూడా చెప్పాల్సిన రీతిలో పాకిస్థాన్ చెప్పలేకపోయిందన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన సోమిశెట్టి మధుసూదన్, చంద్రమౌళితో పాటు పలువురు ఉగ్రదాడికి బలైపోవడం బాధాకరమన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించారు.



నెల్లూరు, (చైతన్యరథం): ఏరో స్పేస్, డిఫెన్స్ పరిశోధన, తయారీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,

## పాపాఘ్నికి కృష్ణా నీళ్ళు తెస్తాం : పులివెందుల ఇన్చార్జి బీటెక్ రవి

పులివెందుల, (చైతన్యరథం): వేంపల్లిలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బీటెక్ ప్రారంభించారు. అనంతరం చింతలమడుగు పల్లి సమీపంలో నీటి ఎద్దడి కారణంగా ఎండిపోతున్న తమల పాకుల



తోటలను రైతులతో కలిసి పరిశీలించారు. వేంపల్లి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, షబ్బీర్, ఇతర టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 10, 15 రోజుల్లో వేంపల్లి పాపాగ్నికి కృష్ణాజిల్లాలను తీసుకొస్తామని రవి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని నింపామన్నారు.యుద్ధ ప్రాతిపదికన నందిపల్లె చెరువుకు నీటిని అందించి, అక్కడ నుంచి కాలువల ద్వారా వేంపల్లి పాపాఘ్న నదికి కృష్ణాజిల్లాలను తీసుకొస్తామన్నారు. ఎండిపోతున్న పంటలకు నీరు అందించి కాపాడుతామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబుతో మాట్లాడి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. వేంపల్లి పాపాఘ్న నదికి నీరు వస్తే.. త్రాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.



కనిగిరి 5వ వార్డు కనకపట్నంలో రూ. 15 లక్షలతో సిమెంట్ కాల్వల శంస్థాపన చేసిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింంహారెడ్డి, పాల్గొన్న అధికారులు

# విద్య ద్వారానే పేదల జీవితాల్లో వెలుగులు

## కూటమి ప్రభుత్వంలో పేదల కలల సాకారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

దర్శి, (చైతన్యరథం): కురిచేడు, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండల కేంద్రాలలో అప్ గ్రేడ్ కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల నూతన భవన నిర్మాణానికి గురువారం భూమిపూజలో దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ విద్య ద్వారా అభివృద్ధి సాధ్యమని గుర్తించి కూటమి ప్రభుత్వం. విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతుందన్నారు. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వంలో కస్తూరీబా పాఠశాలలను ప్రారంభించుకున్నామన్నారు. ఆ పాఠశాలలు పేదల జీవితాలలో విద్య కాంతులు నింపుతున్నాయన్నారు. యువ నేత యువతకు స్ఫూర్తి ప్రదాత ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ ఉన్నత విద్యను అభ్యసించిన మహోన్నత వ్యక్తి అలాంటి వ్యక్తి మన విద్యాశాఖ మంత్రిగా ఉండడం రాష్ట్ర విద్యాభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో విద్యను విస్మరించారు నాడు నేడు అనే పేరుతో ఉపాధ్యాయులను వేధించారు కుల మతాలను రెచ్చగొట్టారు విద్యార్థులలో వైశాల్యాలు పెంచారు చదువు లేకుండా ప్రైవేటు విద్యను ప్రోత్సహించారు స్కాలర్షిప్పు నిధులు మంజూరు చేయలేదు ఉపకార వేతనాలు ఇవ్వలేదు విద్యను నిర్వీర్యం చేశారన్నారు.



మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే ఇంజనీరింగ్ కాలేజీలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయడం, విద్యకు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయడం స్కూలు భవనాలు నిర్మించుకోవడం పాఠశాలల్లో సరికొత్త సిలబస్ల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడం అనేక పరిశ్రమలను రాబట్టుకునేందుకు దావుస్ పర్యటన ద్వారా సాధ్యం చేయగలిగారు మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం చేస్తున్న కృషి చేస్తున్నారన్నారు. మన నాయకుల స్ఫూర్తితో కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని మనం కూడా అందిపుచ్చుకొని దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చుకుందాం మీ అందరి సహకారంతో విద్యా, వైద్యం మౌలిక సదుపాయాల ధ్యేయంగా వెనుకబడిన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చే బాధ్యత నేను తీసుకుంటాను మీ అందరూ ఆశీస్సులు దీవెనలు నాకు ఎల్లవేళలా ఉంటాయని కోరుకుంటూ న్నాను. ఈ సందర్భంగా విద్యార్థులు కూడా వారి నైపుణ్యాలను వెల్లడిస్తూ దేశ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ బాబును స్ఫూర్తిగా తీసుకొని మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె కోరారు.



# అభివృద్ధి సాధనే గ్రామస్వరాజ్ లక్ష్యం

## పథకాల అమల్లో సర్పంచ్‌లే కీలకం, ఏపీడీసీ చైర్మన్ నూకసాని

ఒంగోలు, (చైతన్యరథం): ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో నేషనల్ లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ సాధన సమితి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం – 2025 సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తుందన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, స్వయం పాలన ద్వారా అభివృద్ధిని సాధించడమే గ్రామ స్వరాజ్ లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా సర్పంచులు నిజమైన మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన సర్పంచులను గుర్తించి ఉత్తమ స్థానిక నాయకత్వ సేవ పురస్కారాలు, ప్రశంసా పత్రాలను చైర్మన్ నూకసాని బాలాజీ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా సర్పంచుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రాచారి, ప్రధాన కార్యదర్శి వసంత, జిల్లా కార్యదర్శి రాజమ్మ, కార్యవర్గ సభ్యులు రమేష్, ఇతర నాయకులు జిల్లాలోని వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో విచ్చేసిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై చర్చ జరగడంతో పాటు, పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక సదస్సు కూడా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ పంచాయతీరాజ్ చట్టం ద్వారా సాధించిన విజయాలను గుర్తుచేస్తూ, స్థానిక స్వయం పాలనను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరాన్ని తెలిపారు. గ్రామాభివృద్ధి లోకల్ నాయకత్వం ద్వారా సాధ్యమవుతుందని, ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.






# కూటమితోనే రైతులందరికీ ప్రయోజనాలు

**వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత, మూడు మండలాల రైతులకు 25లక్షల యంత్ర పరికరాలు పంపిణీ, వైసీపీ హయాంలో సొంత పార్టీ వారికే యంత్ర పరికరాలు వచ్చాయి. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన**

రాప్తాడు, (చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తమ సొంత పార్టీలోని కొందరు రైతులకు మాత్రమే యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు వంటివి వచ్చాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి రైతుకు యంత్రపరికరాలు అందిస్తున్నామన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ చేపట్టారు. ముందుగా ఎమ్మెల్యే సునీత కార్యాలయం ఆవరణంలో ఉంచిన యంత్రాలను పరిశీలించారు. వాటి పనితీరు గురించి ఆరా తీశారు. అలాగే అవి రైతులకు ఎలా ఉపయోగపడుతాయన్నది కూడా తెలుసుకున్నారు. ఆ తర్వాత వ్యవసాయ అధికారులు శాలువా, గజమాలతో ఎమ్మెల్యే సునీతను ఘనంగా సత్కరించారు. అనంతరం రైతులకు యంత్రాలను పంపిణీ చేశారు. వీటిలో కల్టివేటర్-స్ప్రింగ్, రిజిడ్, ట్రింగ్, పవర్ స్ప్రేయర్, వీడర్, టిల్లర్, లెవలింగ్ బ్లేడ్, రోటావేటర్, బండ్ ఫార్మర్, బాటరీ స్ప్రేయర్, సీడ్, ఫెర్టిలైజర్ డ్రిల్ వంటి పరికరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లోని 35మంది రైతులకు 25లక్షల విలువైన పరికరాలు అందించామన్నారు. ఇందులో 13లక్షలు రైతులు చెల్లిస్తే.. 12లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. గతంలో ఇదే మూడు మండలాల రైతులకు 25లారీల్లో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో ఐదు ఎకరాల వరకు మాత్రమే డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించారని ఆక్షేపించారు. అయితే తాము ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి.. అసెంబ్లీలో చర్చించిన తర్వాత 10ఎకరాల వరకు సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. అనంతపురం జిల్లా రైతులకు ఏ సమస్య ఉందని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారని.. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఏది అడిగినా వెంటనే చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ ద్వారా పండ్లతోటల పెంపకంతో పాటు పలు రకాల పథకాలు వస్తున్నాయని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిని కేవలం డబ్బు కోసం మాత్రమే చూస్తే మీకు ఎలాంటి ఉపయోగం ఉండదని.. పండ్ల తోటలను ఆరేళ్లు పోషిస్తే.. ఆ తర్వాత మిమ్మల్ని 20 నుంచి 30ఏళ్లు పోషిస్తాయన్నారు. ఇంకా అర్హులైన రైతులందరికీ త్వరలోనే యంత్ర పరికరాలు అందిస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.








## మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**కుట్టు శిక్షణా కేంద్రంప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల**

గిద్దలూరు, (చైతన్యరథం): మహిళా సాధికారతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు అన్నారు. గురువారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ పైన ఉన్నటువంటి సచివాలయ భవనంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాన్ని గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదింటి మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో వారికి కుట్టు మిషన్ల శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గిద్దలూరు నియోజకవర్గంలో ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఒక్క హామీని నెరవేరుస్తామని దీపం పథకం ద్వారా ఇప్పటికే ఉచిత సిలిండర్లు అందచేస్తున్నామని, జూన్ నాటికీ ప్రతీ ఒక్కరికి తల్లికి వందనం ద్వారా ప్రతీ తల్లికి నగదును వారి అకౌంట్లలో జమ చేస్తామని, గత పాలకుల లాగా మాటల ప్రభుత్వం కాదని, చెప్పిన ప్రతీ పథకాన్ని అమలు చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, తాహసిల్దార్ ఆంజనేయ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, మండల, పట్టణ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేశావలి, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాద దాడిలో పర్యాటకుల మృతి బాధాకరం

**రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ జి. నరసింహా యాదవ్**



తిరుపతి, (చైతన్యరథం): జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాద దాడిలో పర్యాటకుల మృతి ఎంతో బాధాకరమని తిరుపతి జిల్లా టిడిపి పార్లమెంటు అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో మరణించిన కుటుంబాలను విశాఖలో సీఎం చంద్రబాబు పరామర్శించి ఓదార్చిన విషయాన్ని గుర్తు చేశారు.. జరిగిన ఘటనపై మోదీ నాయకత్వంలోని క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలంతా హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. పక్క దేశాలతో భారతదేశం ఎంతో సఖ్యంగా ఉంటోందని, అయితే పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై సైన్యం కూడా కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పర్యాటకులపై దాడికి తెగబడడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్లో జరిగిన దాడుల్లో మతం, కులం పేర్లు తెలుసుకొని మరి వారిని కాల్చి చంపడం దారుణమైన చర్య అని అన్నారు. ఉగ్రదాడిపై భారతదేశంలో పాటు ఇతర దేశాలు కూడా కలిసి ఉక్కు పాదం మోపేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సైన్యం కూడా ఎంతో కష్టించి పనిచేస్తుందన్నారు. సైన్యానికి దేశ ప్రజలంతా కూడా మద్దతు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, మాజీ కౌన్సిలర్ హేమంత్ యాదవ్, మాజీ గంగమ్మ గుడి బోర్డు మెంబర్ సుధాకర్ రెడ్డి, టిడిపి నేతలు సుబ్బు యాదవ్, ఎస్.కె శ్రీధర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.




# సాయి సేవా మార్గంలో నడుద్దాం

**పుట్టపర్తి నారాయణ సేవలో ఎమ్మెల్యే సింధూర, మాజీమంత్రి డాక్టర్ పల్లె**

పుట్టపర్తి, (చైతన్యరథం): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చూపిన సేవ మార్గంలో మనమంతా నడుద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి లోని హిల్ హ్యూ స్టేడియంలో నిర్వహించిన సత్యసాయిబాబా 14 వ ఆరాధనోత్సవాల కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జే రత్నాకర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, నాగనంద, మనోహర్ శెట్టి నీమీష్ పాండే తదితరులు హాజరయ్యారు. స్టేడియంలో ఏర్పాటుచేసిన మహా నారాయణ సేవలో భక్తులకు అన్న ప్రసాదం చీరలు నూతన వస్త్రాలను సాయి మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్, హిమ వాహిని హిమ వాహిని, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా వితరణ చేశారు. ఈనారాయణ సేవా కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి సాయి భక్తులు భారీగా తరలివచ్చారు. అక్కడికి తరలివచ్చిన భక్తులకు సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నూతన వస్త్రాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్ జే రత్నాకర్, ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా వితరణ చేశారు.





**కనిగిరిలో చేపట్టిన అభివృద్ధిపనుల్లో భాగంగా 8వ వార్డులో 16 లక్షల రూపాయలతో సిమెంట్ కాల్వల పనులకు శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.**

# పహల్గామ్ ముష్కరులు..

# ఎక్కడ నక్కినా వేటాడి ఏరేస్తాం

### ఉగ్రవాదులకు ప్రధాని మోదీ హెచ్చరిక - సాయమందించిన వారూ మూల్యం చెల్లించుకోకతప్పదు

పాట్నా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులను బలితీసుకున్న ఉగ్రవాదులకు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరిక చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్‌లోని మధుబనిలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచానికి మేము చెప్పేది ఒక్కటే.. ఉగ్రవాదులను, వారికి సాయమందించిన వారందరికీ గుర్తించి శిక్షిస్తాం. భూమి అంచుల వరకూ వారిని వెంటాడి పట్టుకుంటాం. ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా సరే వెతికి పట్టుకుని శిక్షిస్తామని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గామ్ మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం అని మోదీ అన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్థావరాలను, వారి కుట్రలను నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. 140 కోట్ల మంది భారతీయులు ఒకటిగా నిలిచి ఉగ్రమూకల వెన్నెముకను విరిచేస్తారనని ప్రధాని గట్టిగా హెచ్చరించారు..

ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదని మోదీ స్పష్టం చేశారు. ఈ నెల 22న జమ్మూకశ్మీర్లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కాశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

### సింధు జలాల ఒప్పందం రద్దు..

## పాకిస్థాన్‌కు చావుదెబ్బ!



న్యూఢిల్లీ: సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకోవటమంటే పాకిస్థాన్ నవనాడులనూ స్తంభింపజేసినట్లే. జమ్మూకశ్మీర్‌లో పహల్గామ్‌లో ముష్కరమూకల పైశాచిక దాడి తర్వాత పాకిస్థాన్‌ను భారత్ ఊహించని దెబ్బకొట్టింది. సైనికపర చర్యలకు భారత్ సిద్ధమవుతుందని భావించిన పాక్ సైనికాధికారులు సరిహద్దుల్లో తమ దళాలను మోహరించుకొని కూర్చొన్నారు. కానీ భారత్ మాత్రం.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుని వారి ఊహకు అందని దెబ్బకొట్టింది. వాస్తవానికి గతంలో పాక్‌తో యుద్ధాలు, సైనిక ఘర్షణలు జరిగినప్పుడు కూడా భారత్ పెద్ద మనసుతో ఈ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కట్టుబడింది. ఎందుకంటే ఆ నదుల జలాలు పొరుగుదేశానికి జీవనాడులు. కానీ, ఈసారి సహనం నశించిపోవడంతో ఈ నిర్ణయం తీసుకొంది.

ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన నీటి పంపిణీల్లో సింధూ జలాల ఒప్పందం ఒకటి. 1960లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ దీనిని కుదుర్చుకొన్నాయి. ఆరు నదుల నీటిని ఇరుదేశాలు పంచుకొన్నాయి. ఈ ఒప్పందం కింద సింధూ, జీలమ్, చీనాబ్ నదుల నీరు పాకిస్థాన్‌కు దక్కింది. ఇవి కాకుండా రావి, బియాస్, సట్లెజ్ జలాలు కూడా వెళుతుంటాయి. ఇక భారత్ ఈ నదుల్లో ప్రవహించే నీటిని పాకిస్థాన్‌కు చేరేలా వాడుకోవాలి. అంటే జలవిద్యుత్ ఉత్పత్తి వంటి వాటికి మాత్రమే వినియోగించాలి. కానీ, పాక్ మాత్రం తాగు, సాగునీటికి పూర్తిగా ఈ నీటి పైనే ఆధారపడింది. దీనిని దృష్టిలో ఉంచుకొనే ఎన్ని సంఘర్షణలు జరిగినా భారత్ దయతో ఈ ఒప్పందం కొనసాగించింది.


ఇప్పుడు ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను పూర్తిగా ఎండబెడుతుంది. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా ఈ నదుల పైనే ఆధారపడింది. ఆ దేశంలో 20 కోట్లకు పైగా ప్రజల తాగునీటి అవసరాలకు ఈ జలాలను వాడతారు. కరాచీ, లాహోర్, ముల్తాన్ నగరాలు నేరుగా ఈ నదుల నీటినే ప్రజలకు అందిస్తున్నాయి. పాక్ వ్యవసాయానికి వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. ఈ నీటి కింద 16 లక్షల హెక్టార్లు సాగవుతుంటాయి. ముఖ్యంగా పాక్ రాజకీయాలు, సైన్యాన్ని శాసించే పంజాబ్ ప్రావిన్స్‌కు ఇది జీవనాడి. ఆ దేశ జీడీపీలో 23 శాతం వ్యవసాయం నుంచే లభిస్తుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. ఆ దేశ ఆహారభద్రతకు సింధు జలాలు చాలా కీలకం. పాకిస్థాన్ ఇప్పటికే తీవ్రమైన నీటి కరవులో ఉంది. ఆ దేశ ఇరిగేషన్ మేనేజ్మెంట్ అధ్వాన స్థితికి చేరింది. భూగర్భజలాలు పడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉప్పునీరు చొచ్చుకొస్తోంది..

పాకిస్థాన్ విద్యుత్తుకు కీలకమైన మంగల డ్యామును జీలమ్ నదిపై నిర్మించారు. ఏటా ఆ దేశ విద్యుత్తు ఉత్పత్తిలో 8 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇక సింధూ నదిపై నిర్మించిన తర్బెల డ్యామ్ పాక్ వినియోగంలో 16 శాతానికి సమానమైన విద్యుత్తును తయారుచేస్తుంది. తాజాగా సింధూ జలాల ఒప్పందంతో పాక్‌లో 24 శాతం జల విద్యుత్తుపై ప్రతికూల ప్రభావం పడనుంది. పాకిస్థాన్ జీడీపీలో 25 శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు.

తక్షణం లేకపోయినా...

భారత నిర్ణయం ప్రభావం తక్షణమే పాకిస్థాన్‌పై కనిపించకపోవచ్చు. నీటి ప్రవాహాన్ని వెంటనే ఆపడం సాధ్యం కాదు. సింధూ జలాలను నిల్వ చేయడానికి, మళ్లించడానికి తగిన వసతులు లేవు. ఇప్పటివరకు ఉన్న ఒప్పందం కారణంగా సింధూ, జీలం, చీనాబ్ నదుల ప్రవాహానికి ఆటంకం కలిగించే నిర్మాణాలను భారత్ చేపట్టలేదు. కాకపోతే తక్షణమే 5–10శాతం ప్రవాహాన్ని మాత్రం తగ్గించగలదు. ఒప్పందం నిలిపివేతతో భారత్ స్వేచ్ఛగా నిర్మాణాలు చేపట్టవచ్చు. ఇక్కడ భారీ డ్యాములకు కొన్నేళ్ల సమయం పట్టొచ్చు. కానీ, ఒక్కసారి నిర్మాణాలు జరిగితే పాక్ గొంతు ఎండినట్లే.

## సీ స్కిమ్మింగ్ పరీక్ష సక్సెస్



ముంబయి: భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. నౌకాదళం పూర్తిగా అప్రమత్తతతో ఉంది. తాజాగా గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో చేధించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. భారత నావికాదళం గురువారం తన తాజా స్వదేశీ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ ను టెస్ట్ ఫైర్ చేసింది. సముద్ర ఉపరితలంపై నుంచి దూసుకెళ్లే తక్కువ ఎత్తులో వెళ్లే వేగవంతమైన క్షిపణి ఇది. ఐఎన్ఎస్ సూరత్ తన లక్ష్యాన్ని విజయవంతంగా అడ్డుకుని నాశనం చేసిందని ఇండియన్ నేవీ ప్రకటించింది. ఈ విజయవంతమైన పరీక్ష భారతదేశ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంలో మరో ముఖ్యమైన భూమిక పోషిస్తుంది.

అంతేకాదు, పాకిస్థాన్ తన కరాచీ తీరప్రాంతం నుండి, దాని ప్రత్యేక ఆర్థిక మండలంలో, ఉపరితలం నుండి ఉపరితలం వరకు క్షిపణి పరీక్షను నిర్వహించాలని ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో మన టెస్ట్ ఫైర్ జరగడం విశేషం.

సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్లుగా పేర్కొంటారు. ఐఎన్ఎస్ సూరత్, వివిధ రకాల మిలటరీ ప్లాట్‌ఫాంలో కలిసి లక్ష్యాన్ని ట్రాక్ చేస్తూ ధ్వంసం చేసింది.

## ప్రాణాలు తీసి సంబరాలా?

### - పాక్ హై కమిషన్ కార్యాలయం తీరుపై ఆగ్రహావేశాలు



న్యూఢిల్లీ: అమాయకుల ప్రాణాలు తీసి సంబరాలు చేసుకుంటున్నారా.. అంటూ ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ మొత్తం రగిలిపోతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలోని పాక్ హైకమిషన్ వద్ద ఓ వ్యక్తి కేక్ బాక్స్‌తో లోపలికి వెళ్తున్నట్లు కనిపిస్తున్న ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీనిపై నెట్టింట విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ సంబరాలు చేసుకునేందుకు కేక్ తీసుకెళ్తున్నారు? మీరు పాకిస్థాన్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తా? ఈ బాక్స్‌లో ఏముంది? కేక్ తీసుకెళ్లేందుకు సందర్భం ఏంటి?" అని మీడియా ప్రతినిధులు ప్రశ్నలు కురిపించినప్పటికీ.. ఎటువంటి సమాధానం చెప్పకుండానే ఆ వ్యక్తి వెళ్లిపోయినట్లు వీడియోలో కనిపిస్తోంది. దీనిపై నెటిజన్లు మండిపడుతున్నారు. పహల్గామ్ ఘటనతో విషాదం నెలకొన్న వేళ సంబరాలా? అంటూ పలువురు ప్రశ్నించారు. మరోవైపు ఈ ఘటనపై ఇంటలిజెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

## పాక్ ప్రజలకు వీసాలు నిలిపివేత

### - విదేశాంగశాఖ ప్రకటన




న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. దాయాది పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ ఆదేశాలు ఇచ్చింది. పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచి రద్దు కానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. భారత పౌరులు పాక్ లో పర్యటించవద్దని సూచిస్తున్నాం.అంటూ మన విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది.

ఇదిలా ఉంటే. పహల్గామ్ ఘటన తర్వాత ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. భారత్లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది. అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు వారు దేశం వీడి వెళ్లేందుకు వారం గడువు విధించారు. సార్క్ వీసా మినహాయింపు పథకు ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మే ఒకటో తేదీలోగా దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విదేశాంగ శాఖ ఆ దేశ ప్రజలనుద్దేశించి సవివర ప్రకటన విడుదల చేసింది. ఇక ఇప్పటికే పాక్ జాతీయులు అమృత్‌సర్‌లోని అటారీ–వాఘా రోడ్డు మార్గం ద్వారా భారత్‌ను వీడుతున్నారు. దీనిలో భాగంగా పలు పాకిస్థానీ కుటుంబాలు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్దకు చేరుకున్నాయి.

# పాక్.. ఓ కాపీ క్యాట్!

**- భారత్ చర్యలనే కౌంటర్‌గా ప్రకటించిన వైనం**



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న ద్వైపాక్షిక చర్యలపై పాక్ స్పందించింది. ఈ అంశంపై భద్రతా వ్యవహారాలపై ఏర్పాటైన ఆ దేశ అత్యున్నత కమిటీ కొన్ని గంటలపాటు సమావేశమైంది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, త్రివిధ దళాధిపతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాక్ తీసుకున్న పలు నిర్ణయాలు.. దాదాపు భారత్ తీసుకున్న చర్యలనే కాపీ కొట్టింది. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా తమ దేశంలో పర్యటిస్తున్న భారత జాతీయులకు అనుమతులతో పాటు, ఇతర వీసాలను సైతం పాక్ రద్దు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో నిన్న జరిగిన అత్యున్నత సమావేశంలో భారత్ సైతం ఇదే నిర్ణయం తీసుకుంది. పాక్‌లోని హైకమిషన్ కార్యాలయంలోని భారత దౌత్య సిబ్బందిని 30కి తగ్గించింది. అంతకుముందు భారత్ కూడా ఇదే చర్యలను ప్రకటించింది. నిన్నటి సమావేశంలో అటారీ బోర్డర్‌ను మూసివేయాలని భారత్ నిర్ణయించగా.. పాకిస్థాన్ సైతం వాఘా బోర్డర్‌ను మూసివేస్తున్నట్టు ప్రకటించింది. దీంతోపాటు పాక్ గగనతలంంలోకి భారత్‌కు చెందిన విమానాలుగానీ, భారతీయ సంస్థలు నడుపుతున్న విమానాలుగానీ ప్రయాణించకుండా ఎయిర్‌వేస్‌ను మూసివేసింది. సౌదీ పర్యటన ముగించుకున్న అనంతరం ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరోమార్గంలో ప్రయాణించింది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. భారత్‌తో వాణిజ్యాన్ని తెగదెంపులు చేసుకోవాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని అమలును భారత్ తక్షణమే నిలిపివేయడాన్ని పాక్ ఖండించింది. 24కోట్ల పాకిస్థాన్ పౌరులకు సంబంధించిన అంశంగా పేర్కొంది. సింధు జల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి లేదా ఆపడానికి జరిగే ప్రయత్నాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పేర్కొంది. అటువంటి చర్యలను తిప్పికొడతామంటూ సమావేశం అనంతరం పాక్ వెల్లడించింది.

# భారత్ సుంకాలు తగ్గిస్తుంది

***వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలైన వేళ ట్రంప్ వ్యాఖ్యలు***



భారత్ సుంకాలు తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రకాల వస్తువులపై భారత్ సుంకాలు తగ్గించనుందనే విషయం తన దృష్టికి వచ్చిందని ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. అయితే ఏ ఉత్పత్తులపై తగ్గింపు ఉంటుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై భారత్, అమెరికా అధికారులు ఈనెల 23న వాషింగ్టన్‌లో చర్చలు ప్రారంభించారు. భారత్ ఒప్పందంవల్ల అమెరికా వస్తువులకు కొత్త మార్కెట్లు తెరచుకుంటాయని, ఇరు దేశాల్లోని ఉద్యోగులు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు వస్తాయని ఇప్పటికే అమెరికా పేర్కొంది. టారిఫ్, టారిఫేతర అడ్డంకులను అమెరికా తగ్గించుకోవాలని అనుకుంటున్నట్లు యూఎస్ ట్రేడ్ రిప్రెజెంటేటివ్ పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన షరతుల (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సెస్)కు ఇరు దేశాలు తుదిరూపునిచ్చాయి కూడా. 90 రోజులపాటు టారిఫ్ అమలుకు అమెరికా విరామం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు రోజుల చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ తరపు బృందానికి వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌పై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్నవేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలోనే చర్చలు జరుగుతున్నాయి.

# రష్యాపై ఆంక్షలు తొలగించడం లేదు: మార్కో రూబియో



రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో మాస్కోతో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని భావిస్తూ.. ఆ దేశంపై గతంలో విధించిన ఆంక్షలను తొలగించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలను తాజాగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఖండించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. రష్యాపై ఆంక్షలు ఎత్తివేతకు సంబంధించి ఆ దేశంతో అగ్రరాజ్యం చర్చలు జరుపుతున్నట్లు ఓ వార్తా పత్రిక ప్రచురించిన కథనాన్ని రూబియో పంచుకున్నారు. ఇది పూర్తిగా మీడియా విధానంలో అవకతవకలని విమర్శించారు. 'ఈ వార్త పూర్తిగా అవాస్తవం. ఉక్రెయిన్లో శాంతి నెలకొల్పిన నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు ఎత్తివేతలపై నేను లేక, పశ్చిమాసియాలో యూఎస్ రాయబారి స్టీవ్ విట్కాఫ్‌గానీ ఎలాంటి చర్చలు చేయలేదు' అని రూబియో పోస్టులో స్పష్టం చేశారు. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ముగించే చర్చల్లో భాగంగా మాస్కోకు చెందిన కొన్ని సంస్థలు, వ్యక్తులకు ఉపశమనం కల్పిచేలా ట్రంప్ సర్కారు చర్యలు తీసుకొంటున్నట్లు ఇటీవల పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితాను సిద్ధంచేయాలని విదేశీ వ్యవహారాలు, ట్రెజరీ మంత్రిత్వ శాఖలను వైట్ హౌస్ కోరినట్లు అందులో వెల్లడించాయి. రష్యన్ ఒలిగార్లైపైనా ఆంక్షలు ఎత్తివేసే అవకాశాలున్నాయని, రానున్న రోజుల్లో మాస్కో ప్రతినిధులతో అగ్రరాజ్యం అధికారులు చర్చలు జరపనున్నట్లు తెలిపాయి. అయితే అవి అవాస్తవమని తాజాగా రూబియో ఖండించారు. కాగా.. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో శాంతి ఒప్పందంపై ఇరుదేశాల అధినేతలతో అగ్రరాజ్యం ప్రతినిధులు చర్చలు జరుపుతున్నాయి. మరోవైపు.. ఇరుదేశాలు మాత్రం దాడులను కొనసాగిస్తున్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా.. కీవ్‌పై ఆదివారం పదులకొద్దీ డ్రోన్, బాంబు దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపించారు. కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా అధికారులు వెల్లడించారు.

ఐరాస వేదికపై

# అమెరికా చైనా ఫైట్



అమెరికా- చైనాల మధ్య వాణిజ్యయుద్ధం తారస్థాయికి చేరుకుంటోంది. ఇప్పటికే పరస్పర సుంకాలతో ప్రతీకార చర్యలు తీసుకొంటున్న ఇరు దేశాలు తాజాగా.. ఐక్యరాజ్య సమితి వేదిక మీద విమర్శ, ప్రతివిమర్శలతో విరుచుకుపడ్డాయి. అమెరికా సుంకాల ధోరణి మాపై బెదిరింపులతో కూడినదిగా ఉందని చైనా విమర్శించగా.. అమెరికా బీజింగ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చింది. బుధవారం ఐరాసలో భద్రతా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో చైనా తరపు రాయబారి ఫు కాంగ్ మాట్లాడుతూ యూఎస్ విధించిన సుంకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం తమ వాణిజ్య భాగస్వాములపై సుంకాలు విధించి ప్రపంచ ఆర్థికవ్యవస్థకు విఘాతం కలిగించింది. పరస్పరం అనే ముసుగులో యూఎస్ టారిఫ్‌ల ఆట ఆడుతోంది. ఇతర దేశాలకు నష్టం కలిగించి.. తమ సొంత ప్రయోజనాలను అభివృద్ధి చేసుకోవాలని చూస్తోంది. ఈ చర్య ఇప్పటికే అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్యక్రమాన్ని దెబ్బతీస్తోంది. మేము అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలా, లేక ఇలాంటి అర్థంలేని చట్టాలను పాటించాలా? మాపై భారీస్థాయిలో సుంకాలు విధించడం బెదిరింపులతో కూడినదిగా ఉంది. ఇలా మాపై ఒత్తిడి పెంచడం సరైన చర్య కాదు' అని ఫు కాంగ్ పేర్కొన్నారు.

ఇక, ఈ వ్యాఖ్యలకు అమెరికా మిషన్ ప్రతినిధి టింగ్ వు గట్టిగా బుదులిచ్చారు. చైనా విశ్వసనీయత లేని వ్యాఖ్యలు చేస్తోందన్నారు. ప్రపంచం చైనా వాదనలు వినకుండా.. ఆ దేశం చేస్తున్న చర్యలను చూడాలని ఆయన ఎద్దేవా చేశారు. చాలాకాలంగా బీజింగ్ ఏకపక్షమైన, అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరించిందన్నారు. కాగా.. ప్రపంచ దేశాలపై సుంకాల విధింపులో భాగంగా వాణిజ్య దేశాలతో పాటు ట్రంప్ చైనా పైనా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ దేశంపై 145 శాతం సుంకం అమలులో ఉంది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యంపై బీజింగ్ 125 శాతం టారిఫ్లను ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది.

# 'అమెరికన్లూ.. అటుపోవద్దు'



పహల్గాం ఉగ్రదాడితో అమెరికా అప్రమత్తమైంది. తమ దేశస్తులు ఎవరూ జమ్మూకశ్మీర్‌కు ప్రయాణాలు పెట్టుకోవద్దని అడ్వైజరీని జారీ చేసింది. ఉగ్రదాడులు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదముందని పేర్కొంది. దీంతోపాటు భారత్- పాక్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల సమీపంలోకి కూడా వెళ్లొద్దని తెలిపింది. "కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్లో ఉద్రిక్త పరిస్థితి తలెత్తే లేదా ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉంది. ఆ ప్రాంతానికి వెళ్లవద్దు. తూర్పులద్దాఖ్, దాని రాజధాని లేహ్‌కు వెళ్లొచ్చు. ఇక నియంత్రణ రేఖ వద్ద కూడా హింసాత్మక ఘటనలు జరగొచ్చు. కశ్మీర్ లోయలోని శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాంలో హింస చెలరేగవచ్చు. సైనిక ఘర్షణకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో సరిహద్దులకు 10 కిలోమీటర్ల వరకు వెళ్లవద్దు" అని అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది. పహల్గాం దాడిని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయన నిన్న ప్రధాని మోదీకి నేరుగా కాల్ చేసి మాట్లాడారు. ఉగ్రవాదులను పట్టుకోవడంలో భారత్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

# రాజస్థాన్ రాయల్స్‌పై ఆర్సీబీ ఘన విజయం

## - 11 పరుగులు తేడాతో విజయం

ఐపీఎల్ 2025లో భాగంగా బెంగళూరు స్టేడియం వేదికగా తాజాగా జరిగిన ఉత్కంఠ మ్యాచులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఎట్టకేలకు విజయం సాధించింది. సొంత స్టేడియంలో వరుసగా మూడు ఓటముల తర్వాత.. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ పై గెలుపొందింది. 11 పరుగులు తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో హెూమ్ స్టేడియంలో ఆర్సీబీకి తొలి విజయం. ఇదే సమయంలో రాజస్థాన్ రాయల్స్‌కు మరోసారి దురదృష్టం వెంటాడింది. గత రెండు మ్యాచుల నుంచి చేతివరకు వచ్చిన విజయాన్ని చేజార్చుకుంటోన్న ఆర్ఆర్.. ఇప్పుడు కూడా అదే పని చేసింది.

206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 194 మాత్రమే చేసింది. ఆఖరి ఓవర్లలో హెజిల్ వుడ్ మ్యాచ్ అద్భుతంగా ఆర్సీబీపై మలుపు తిప్పాడు. 4 వికెట్లు తీసి రాజస్థాన్ పతనం శాసించాడు. రాజస్థాన్ బ్యాటర్లలో యశస్వి జైశ్వాల్ 19 బంతుల్లో 257 స్ట్రైక్ రేటుతో 7 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 49 పరుగులు మంచి శుభారంభం అందించాడు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 12 బంతుల్లో 2 సిక్సుల సాయంతో 16 పరుగులు చేశాడు. దూకుడు మీదున్న నితీశ్ రానా (22 బంతుల్లో 28: 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ (10 బంతుల్లో 22: 2 ఫోర్లు, 2 సిక్సులు) కృనాల్ పాండ్య దెబ్బతీశాడు. అనంతరం సిమ్రాన్ హెట్మెయర్‌ను (11) ఔట్ చేసి మ్యాచును ఆర్సీబీ వైపు తిప్పాడు హెజిల్ వుడ్. ధ్రువ్ జురెల్ (47), శుభమ్ దూబె (12) పరుగులు చేశారు.

ఆఖరి రెండు ఓవర్లలో రాజస్థాన్ రాయల్స్ విజయానికి 18 పరుగులు అవ్వసరమవ్వగా.. హేజిల్ వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఆర్సీబీ వైపు మ్యాచ్ మలుపు తిప్పాడు. 19వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి ఓవర్లో 17 పరుగులు కావాల్సిన నేపథ్యంలో యశ్ దయల్ వికెట్ పడగొట్టి కేవలం 5 పరుగులే సమర్పించుకున్నాడు. మొత్తంగా ఆర్సీబీ బౌలర్లలో హేజిల్ వుడ్ 4 వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్య 2, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో రాజస్థాన్‌పై ఆర్సీబీకి ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 70: 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (27 బంతుల్లో 50: 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీలు బాదారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 26: 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో జితేశ్ శర్మ (10 బంతుల్లో 20: 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (15 బంతుల్లో 23: 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2 వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్, వానిందు హసరంగ చెరో వికెట్ తీశారు.





యువరాజ్ శిక్షణ ఇస్తే..

## అర్జున్ టెండూల్కర్ మరో క్రిస్ గేల్‌లా అవుతాడు!

*- యోగరాజు సింగ్*

ఐపీఎల్ 2025 సీజన్‌లో సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు. కానీ అర్జున్‌కు ఇంకా ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయితే తాజాగా యువరాజ్ సింగ్ తండ్రి యోగరాజ్ సింగ్ అర్జున్ టెండూల్కర్ గురించి కీలక ప్రకటన చేశారు. అర్జున్ టెండూల్కర్‌కు ప్రతిభ ఉందని.. ముఖ్యంగా అతనిలో బ్యాటింగ్ టాలెంట్ ఉందని ఆయన అన్నారు. యోగరాజు సింగ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కుమారుడు యువరాజ్‌కు అర్జున్‌కి శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఇస్తే అతడిని క్రిస్ గేల్ లాగా తయారు చేయవచ్చని చెప్పుకొచ్చాడు.

బౌలింగ్ బదులుగా అతడిని బ్యాటింగ్‌పై శ్రద్ధ వహించాలని తాను అర్జున్‌కు చెప్పినట్లు యోగరాజ్ సింగ్ వెల్లడించారు. సచిన్ కొడుకు యువరాజ్ సింగ్ నుంచి మూడు నెలలు శిక్షణ తీసుకోవాలని.. అప్పుడు యువరాజ్ అతడిని క్రిస్ గేల్ లాంటి బ్యాటర్‌గా తీర్చిదిద్దగలడని యోగరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఈ రోజు ఐపీఎల్‌లో యువరాజ్ సింగ్ ఇద్దరు శిష్యులు అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మలు ఇద్దరూ యువరాజ్ శిష్యులే. యువరాజ్ తరచూ ఈ ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడి వారికి మార్గనిర్దేశం చేస్తాడు.

### ఐపీఎల్ 2025లో రాని అవకాశం

సచిన్ కొడుకు అర్జున్ టెండూల్కర్‌కు ఈ సీజన్‌లో ఆడటానికి ఇంకా అవకాశం రాలేదు. అర్జున్ టెండూల్కర్ ప్లేయింగ్ ఎలెవన్‌లో కూడా చేరలేకపోయాడు. గత సీజన్లో అర్జున్ కొన్ని మ్యాచ్‌లు ఆడటానికి అవకాశాన్ని పొందాడు. కానీ ఈ సారి అతడికి ఆడటానికి అవకాశం లభించడం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ 2025 వేలంలో అర్జున్ టెండూల్కర్ మొదటి రౌండ్లో అమ్ముడుపోయాడు. ముంబై ఇండియన్స్ అతడిని రూ.30 లక్షలకు కొనుగోలు చేశారు. అర్జున్ టెండూల్కర్ దేశీయ క్రికెట్ గురించి మాట్లాడుకుంటే.. ఇప్పుడు అతను గోవా జట్టు తరపున ఆడుతున్నాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో అద్భుతంగా రాణించాడు. అర్జున్ అరుణాచల్ పై 5 వికెట్లు తీశాడు. అయినప్పటికీ ఈ సారి ఐపీఎల్ లో ఆడడానికి అవకాశం లభించడం లేదు.

# వచ్చే 78 వేల సంవత్సరాలలో కూడా ఏం మారదురా!

## *- భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్*

కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో జరిగిన భీకర ఉగ్రదాడి ఎన్నో కుటుంబాల్లో ఆనందాన్ని చిదిమేసింది. పసిపిల్లల ముందే కరడుకట్టిన ఉగ్రవాదులు పాశవిక దాడికి తెగబడి మరీ చంపారు. వేడుకున్నా కనికరించకుండా, కుటుంబసభ్యుల ముందే నిర్దాక్షిణ్యంగా ప్రాణాలు తీసి రాక్షస ఆనందం పొందారు. ఈ ఉగ్రదాడితో భారత దేశమంతా ఉలిక్కిపడింది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు ప్రతిఒక్కరి హృదయాల్ని కలిచి వేసింది. ఈ క్రమంలోనే భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు కూడా.. ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మీరేం పీకలేరు రా..**

తాజాగా మరోసారి భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్.. ఈ పహల్గాం ఉగ్రదాడిపై స్పందించారు. పాకిస్థాన్‌పై విరుచుకుపడుతూనే లైవ్ టీవీలో ఎమోషనల్ అయ్యారు. "తమ ప్రియమైన వారిని కోల్పోయిన ప్రతి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇది మనమందరినీ (భారతీయులను) ఎంతో ప్రభావితం చేసింది. ఈ భీకర దాడి చేసిన వారికి, వాళ్లకు మద్దతు ఇచ్చిన వారికీ, వాళ్లను ఈ దాడి చేసేందుకు ప్రేరేపించినవారికి.. నేను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ఈ దాడుల ద్వారా మీరు సాధించిందేమిటి? గత 78 సంవత్సరాల్లో ఒక్క మిల్లీమీటర్ భూమి కూడా మన చేతులు మారింది లేదు కదా? వచ్చే 78 వేల సంవత్సరాలు అయినా కూడా మారదు. అందుకే మనం ఎందుకు శాంతిగా ఉండకూడదు? మన దేశాన్ని బలంగా తయారుచేద్దాం. ఇదే నా విజ్ఞప్తి." అని గావస్కర్ ఎమోషనల్ అయ్యారు.

**మొత్తం ఎంత మంది చనిపోయారంటే**

ఏప్రిల్ 22న మంగళవారం పహల్గాం భీకర దాడి జరిగింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముసుగు కప్పి వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టుముట్టి.. అతి దగ్గరి నుంచి వారిపై కాల్పులు జరిపారు. నిర్దాక్షిణ్యంగా తుపాకీ తూటాలను పురుషుల



తలల్లోకి పంపారు. ఈ ఘటనలో మొత్తం 26 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు.

## పహల్గామ్ ఉగ్రదాడి..

# భవిష్యత్‌లో పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోం: బీసీసీఐ

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత భారత క్రికెట్ నియంత్రణ బోర్డుకీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ లో పాకిస్థాన్ క్రికెట్ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోమని తేల్చి చెప్పింది. ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తూ.. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించింది. పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో పాకిస్థాన్‌తో భారత్ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు. భారత్, పాకిస్థాన్ చివరిసారిగా 2012-13లో ద్వైపాక్షిక సిరీస్ ఆడాయి. అప్పుడు పాకిస్థాన్ జట్టు పరిమిత ఓవర్ల సిరీస్ కోసం భారత్ కు వచ్చింది. భారత జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్ లో పర్యటించింది.అప్పుడు టీమిండియా ఆసియా కప్‌లో పాల్గొంది. అయితే 2005-06 తర్వాత భారత జట్టు ద్వైపాక్షిక సిరీస్ కోసం పాకిస్థాన్‌ను సందర్శించలేదు.




కాశ్మీర్ లో శాంతికి విఘాతం కలిగించడంతో పాటు స్థానికులు, పర్యాటకులలో భయాన్ని సృష్టించిన ఉగ్రవాద దాడులపై రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. "మేము పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడము. బాధితులకు మద్దతుగా నిలుస్తాము. ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. మా ప్రభుత్వం ఏం చెప్పినా అలాగే చేస్తాం." అని పేర్కొన్నారు. స్పోర్ట్స్ తక్‌తో మాట్లాడుతూ, 'ప్రభుత్వ సూచనల కారణంగా మేము పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడము' అని అన్నారు. ఐసీసీ ఈవెంట్ ఉన్నప్పుడు మాత్రం ఆడతామని చెప్పారు. ఏం జరిగినా అది వారే చేశారని ఐసీసీసీకి కూడా తెలుసన్నారు.

**విచారం వ్యక్తం చేసిన బీసీసీఐ కార్యదర్శి**

అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిపై బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా విచారం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. "పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడిలో అమాయక ప్రజలు మరణించడం పట్ల క్రికెట్ సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు లోనైంది. ఈ దారుణమైన, పిరికి చర్యను బీసీసీఐ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాను. మృతుల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. మరణించిన వారి ఆత్మలు శాంతించాలని ప్రార్థిస్తున్నాను. వారి బాధను, దుఃఖాన్ని పంచుకుంటూ ఈ విషాద సమయంలో వారితో నిలబడతాం" అని అన్నారు.



## తమిళ ఎంటీకి జాన్వీ?

అందాల భామ జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రంతో టాలీవుడ్‌లో అదిరిపోయే ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా సక్సెస్‌తో అమ్మడికి వరుసగా ఆఫర్లు వచ్చి పడుతున్నాయి. ఇప్పటికే రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాలో జాన్వీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఇప్పుడు తమిళ్‌లోనూ జాన్వీ కపూర్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవు తోందట. ప్రముఖ దర్శకుడు పా రంజిత్ జాన్వీ కపూర్‌తో ఓ వెబ్ సిరీస్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ వెబ్ సిరీస్ సామాజిక అంశాలపై నడుస్తుందని తెలుస్తోంది. వెబ్ సిరీస్‌లో జాన్వీ పాత్ర అల్టిమేట్‌గా ఉండబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. మరి పా రంజిత్ చెప్పిన కథకు జాన్వీ కపూర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆమె వెబ్ సిరీస్‌కు ఓకే చెబితే ఎలాంటి పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.

## బింబిసార-2కి వెళ్తాడా?



నందమూరి కళ్యాణ్ రామ్ రీసెంట్‌గా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేసిన సినిమా యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. అయితే, సినిమా ఊహించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఈ సినిమా రిజల్ట్ తర్వాత కళ్యాణ్ రామ్ ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నాడట. ఈ క్రమంలోనే గిరీశయ్య అనే డైరక్టర్ కళ్యాణ్ రామ్‌కు ఓ కథను చెప్పినట్టు తెలుస్తోంది. కల్ట్ మూవీ అయిన 'అర్జున్ రెడ్డి' చిత్రాన్ని తమిళంలో 'ఆదిత్య వర్మ' అనే పేరుతో రీమేక్ చేశాడు గిరీశయ్య. ఇక మెగా హీరో వైష్ణవ్ తేజ్ నటించిన 'రంగ రంగ వైభవంగా' సినిమాను కూడా ఆయనే డైరెక్ట్ చేశాడు. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కోసం ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా కథను రెడీ చేశాడట. అయితే, కళ్యాణ్ రామ్ ఈ డైరెక్టర్‌ని హోల్డ్‌లో పెట్టినట్లుగా తెలుస్తోంది. 'బింబిసార 2' సినిమాను స్టార్ట్ చేయాలని కళ్యాణ్ రామ్ ఆలోచిస్తున్నాడట. కానీ, ఆ సినిమాకు కావాల్సిన స్క్రిప్ట్ వర్క్ ఇంకా పూర్తి కాలేదని.. అందుకే గిరీశయ్యతో కళ్యాణ్ రామ్ సినిమా చేసే అవకాశం ఉందని సినీ సర్కిల్స్‌లో టాక్.

## బ్లో అప్




## ఫహాద్ కోసం పూరీ వెయిటింగ్



టాలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ ఇటీవల తన నెక్స్ట్ ప్రాజెక్టును అనౌన్స్ చేశాడు. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటించబోయే సినిమాను పూరి తెరకెక్కిస్తున్నాడు. సినిమా షూటింగ్‌ను త్వరలో ప్రారంభించేందుకు పూరి రెడీ అవుతున్నాడు. అయితే, ఈ సినిమాలో విలన్ పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. దీంతో ఈ పాత్రలో సాలిడ్ యాక్టర్‌ను తీసుకోవాలని పూరి చూస్తున్నాడట. దీని కోసం మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ అయితే బాగుంటుందని పూరి భావిస్తున్నాడట. ఇప్పటికే పూరి కథను కూడా వినిపించాడని.. ఆయనకు అది నచ్చిందని తెలుస్తోంది. కానీ, ఫహాద్ బిజీ షెడ్యూల్ వల్ల పూరి కోసం డేట్లు అడ్జస్ట్ చేయలేకపోతున్నారట. దీంతో పూరి వేరే ఆప్షన్స్ ఉన్నా కూడా ఫహాద్ కోసం వెయిట్ చేస్తున్నాడని తెలుస్తోంది. మరి ఫహాద్ నిజంగానే సినిమాకు ఓకే చెబితే ఈ మూవీకి అదిరిపోయే బజ్ క్రియేట్ అవుతుంది.

## రెట్రోకి రజనీని అనుకున్నా..




తమిళ స్టార్ హీరో సూర్య నటించిన లేటెస్ట్ మూవీ 'రెట్రో' మే 1న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ పూర్తి యాక్షన్ అండ్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాడు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. అయితే, సినిమా తొలి హీరో సూర్య కాదట. ఈ విషయాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్వయంగా వెల్లడించాడు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన –తొలుత రెట్రో కథను సూపర్ స్టార్ రజినీకాంత్ కోసం రాసుకున్నాడని.. అది పూర్తి యాక్షన్ జోన్ కథ అని తెలిపాడు. అయితే, సూర్యకు కథను నెరేట్ చేసిన తర్వాత దానిని లవ్ స్టోరీగా మార్చానని తెలిపాడు. రజినీ కోసం కథను రాసుకోవడంతో ఆయనకు వినిపించావా? అని సూర్య కూడా తనను అడిగినట్లు కార్తీక్ సుబ్బరాజ్ తెలిపాడు. ఇక సినిమలో సూర్య అదిరిపోయే లుక్స్‌తో కనిపిస్తుండటంతో అభిమానుల్లో ఈ మూవీపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయ్యాయి. సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా సంతోష్ నారాయణన్ సంగీతం అందించాడు.

## అందుకే.. వద్దనుకున్నా!



నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఇతిహాసగాథ 'రామాయణ'. రాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రావణుడిగా కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈక్రమంలో కథానాయిక శ్రీనిధిశెట్టి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ మూవీలో సీత పాత్ర కోసం తొలుత అవకాశం తనకే వచ్చిందని, ఆడిషన్ కూడా ఇచ్చినట్టు తెలిపారు. అయితే, ఆ పాత్ర వద్దనుకోవడం వెనుక కారణాన్ని వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "రామాయణ'లో సీత పాత్ర కోసం నేను స్క్రీన్ టెస్టుకు వెళ్లా. మూడు సన్నివేశాలకు బాగా సిద్ధమయ్యా. నేను ఇచ్చిన ప్రదర్శనకు చిత్ర బృందం కూడా సంతోషం వ్యక్తం చేసింది. తర్వాత ఇందులో యశ్ భాగమవుతున్నారని తెలిసింది. అప్పటికి 'కేజీయఫ్ 2' విడుదలై మా జోడీకి మంచి పేరు వచ్చింది. ఇదంతా కేవలం రెండు నెలల వ్యవధిలోనే జరిగింది. అయితే, అప్పుడు యశ్ ఏ పాత్ర పోషిస్తున్నారో నాకు తెలియదు. ఒకవేళ ఆయన రావణుడిగా నటించి, నేను సీత పాత్ర చేస్తే, చూడటానికి అస్సలు బాగుండదు. 'కేజీయఫ్'లో మా ప్రేమను చూసిన ప్రేక్షకులు రావణుడు, సీతగా మమ్మల్ని చూసి జీర్ణించుకోలేరనిపించింది. ఈ కాంబినేషన్ తెరపై బాగుండదనిపించింది. పైగా వింతగా ఉంటుందనుకున్నా. సీత పాత్రకు సాయిపల్లవి చక్కటి ఎంపిక. ఆమెను సీత పాత్రలో చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఉన్నా' అని శ్రీనిధి తెలిపారు. ప్రస్తుతం నానితో కలిసి శ్రీనిధి నటించిన 'హిట్' మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతోపాటు సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న 'తెలుగు కదా' సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.